'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

www.rajyasamskarana.com

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 21 | శనివారం | 5.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 21 | Saturday | 5.9.2026 | Pages: 8 | Rate: 2

## చిన్నారెడ్డి ఎవరు?

### నాటి హీరో నేడు విలన్ ఎలా అయ్యారు?

**మాజీ మంత్రిని అందుకే పక్కనపెట్టారా?**

**తెలంగాణకై తొలినాటి పోరాట యోధుడు**




తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాంగ్రెస్‌లోనే తొలి గొంతు వినిపించిన నేతల్లో జిల్లెల చిన్నారెడ్డి ఒకరని ఆయన అనుచరులు గుర్తుచేస్తున్నారు. రాష్ట్ర ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫోరం ఏర్పాటు చేసి 42 మంది ఎమ్మెల్యేల సంతకాలు సేకరించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలోనే కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి మెమోరాండం సమర్పించారు.




## నీటి వాటాపై తేలని పంచాయితీ

### కృష్ణా జలాలపై మళ్లీ ప్రతిష్ఠంభన

**66:34పై ఏపీ, 50:50పై తెలంగాణ పట్టు**

కృష్ణాజలాలపంపిణీపైఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య మరోసారి ప్రతిష్ఠంభన ఏర్పడింది. 202627 నీటి సంవత్సరానికి సంబంధించి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ముగ్గురు సభ్యుల కమిటీ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగినా నీటి వాటాపై ఎలాంటి ఏకాభిప్రాయం కుదరలేదు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే పరిస్థితుల్లోనూ రెండు రాష్ట్రాలు తమ పాత వాదనలకే కట్టుబడ్డాయి. 201516లో తాత్కాలికంగా అంగీకరించిన 66:34 నిష్పత్తి కొనసాగించాలని ఏపీ కోరుతోంది. తెలంగాణ మాత్రం 2020 నుంచి డిమాండ్ చేస్తున్న 50:50 వాటా విషయంలో వెనక్కి తగ్గడం లేదు.




## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ జలమయం.. ప్రయాణికుల అవస్థలు

**భారీ వర్షంతో విమాన సేవలకు తీవ్ర అంతరాయం**

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో వర్షం ప్రయాణికులకు చుక్కలు చూపించింది. భారీ వర్షంతో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రవేశ ద్వారాల వద్ద నీరు భారీగా చేరింది. దీంతో ప్రయాణికులు ప్యాంట్లు పైకి మడుచుకుని, లగేజీ ట్రాలీలను నీటిలో తోసుకుంటూ గేట్ల వైపు వెళ్లాల్సి వచ్చింది. కొందరు నీరు తగ్గే వరకు దాదాపు అరగంటపాటు అక్కడే నిలబడిపోయారు. ఎయిర్‌పోర్ట్ బయట పరిస్థితి ఇలా ఉంటే.. లోపల విమాన సర్వీసులపై కూడా వర్షం ప్రభావం పడింది. ఢిల్లీకి రావాల్సిన పలు విమానాలు ఇతర నగరాలకు దారి మళ్లాయి.



## థేమ్స్ తీరాన గంగా హారతి

### గంగ ఎక్కడైనా.. భక్తి ఒక్కటేనా?

**హర్ష్ గోయెంకా ఘాటు ప్రశ్నలు**

లండన్‌లోని థేమ్స్ నది తీరాన ఈనెల 13న గంగా హారతి నిర్వహించనున్నట్లు వచ్చిన ప్రకటన ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ప్రముఖ వ్యాపారవేత్త హర్ష్ గోయెంకా దీనిపై వ్యంగ్యంగా స్పందిస్తూ.. "గంగా లేకుండా గంగా హారతి ఎలా?" అంటూ ప్రశ్నించారు. థేమ్స్ నదిపై గంగా హారతి నిర్వహించడాన్ని ఆయన ఇతర ఉదాహరణలతో పోల్చారు. ఫ్రాన్స్‌లోని సీన్ నదిపై కుంభమేళా నిర్వహిస్తారా? ఇటలీలోని లేక్ కోమోలో కశ్మీర్ దాల్ లేక్ శికారా పడవలు నడుపుతారా? లండన్ హైడ్ పార్క్‌లో పుష్కర్ ఒంటెల జాతర పెడతారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. సంప్రదాయాలకు వాటి మూల ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని గుర్తించాలన్న భావన ఆయన వ్యాఖ్యల్లో కనిపించింది. (వివరాలు 2లో..)



# బీఆర్ఎస్ అసెంబ్లీ వ్యూహం

**• సెప్టెంబర్ 6న ఎర్రవల్లిలో భేటీ • కేసీఆర్ అధ్యక్షతన కీలక సమావేశం**

సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ శాసనసభా పక్ష సమావేశానికి నిర్ణయించారు. సెప్టెంబర్ 6న ఎర్రవల్లి నివాసంలో మధ్యాహ్నం 2 గంటలకు కేసీఆర్ అధ్యక్షతన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సంయుక్త సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 1 గంటకు లంచ్ అనంతరం సమావేశం ప్రారంభమవుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ భేటీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా హాజరుకావాలని కేసీఆర్ సూచించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు సంబంధించిన కీలక అంశాలను సభలో ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసే విధానంపై కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. సభలో బీఆర్ఎస్ సభ్యులు సమన్వయంతో వ్యవహరించేందుకు అవసరమైన అంశాలను కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. దీంతో అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ఒక రోజు ముందే ఎర్రవల్లిలో జరిగే కేసీఆర్ భేటీకి రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. (వివరాలు 2లో..)






## కేసీఆర్ చాలా మంచోడు

**• కొండా సురేఖ ప్రశంసలు • బీఆర్ఎస్ వైపు అడుగులు?**

కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ.. వరుస ఇంటర్వ్యూల్లో సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీసింది. గతంలో బీఆర్ఎస్‌లో పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్న సురేఖ.. కేసీఆర్ చాలా మంచి వ్యక్తి అని చెప్పారు. తమను కలిసిన ప్రతిసారీ చాలా గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం కోరిన వెంటనే కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. (వివరాలు 2లో..)

## బీఆర్ఎస్‌లోకి నో ఎంట్రీ

**సురేఖకు గులాబీ తలుపులు బంద్**

**తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం**



మంత్రివర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్ అయిన తర్వాత ఆమె బీఆర్ఎస్‌లో చేరుతారనే ప్రచారం ఊపందుకున్న నేపథ్యంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి తీసుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. చివరకు ఆమెను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వబోమని తీవ్రంగా వ్యాఖ్యానించారు. గతంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన నేతలను తిరిగి పార్టీలోకి తీసుకునే విషయంలో తమ పార్టీ కఠినంగా ఉంటుందని తెలిపారు. ఒకరిద్దరిని మినహాయిస్తే మిగతా నేతలకు గులాబీ తలుపులు తెరవబోమని స్పష్టం చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సురేఖను బర్తరఫ్ చేయడం కాదని, సీఎం రేవంత్‌రెడ్డినే పదవి నుంచి తొలగించాలని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. (2లో..)

## హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలే

- **సురేఖపై వేటు.. క్రమశిక్షణే కారణం!**
- **బర్తరఫ్ బాధాకరమే.. క్రమశిక్షణ ముఖ్యం**
- **పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు**

కొండా సురేఖను తెలంగాణ మంత్రివర్గం నుంచి తొలగించిన వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సురేఖ బర్తరఫ్ బాధాకరమైన పరిణామమేనని, అయితే కాంగ్రెస్‌లో పార్టీ క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ఢిల్లీలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను ఆమె వెంటనే ఖండించాల్సిందని అభిప్రాయపడ్డారు. (వివరాలు 2లో..)





## సురేఖ బర్తరఫ్.. డీకే అరుణ ఆవేదన

**అప్పుడు సంతోషించా.. ఇప్పుడు బాధగా ఉంది**

**తోటి మహిళా నేతకు అన్యాయం జరిగిందన్న ఎంపీ**

కొండా సురేఖను తెలంగాణ మంత్రివర్గం నుంచి తొలగించిన వ్యవహారంపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సురేఖతో కలిసి మంత్రిగా పనిచేసిన విషయాన్ని గుర్తుచేసుకున్న ఆమె.. ఒక మహిళా నాయకురాలు ఎన్నో రాజకీయ ఒడిదుడుకులు ఎదుర్కొని మంత్రి స్థాయికి రావడం సాధారణ విషయం కాదన్నారు. (వివరాలు 2లో..)

## సురేఖపై వేటు సరే పొంగులేటిపై ఎప్పుడు?

**22ఏ భూములపై హరీశ్‌రావు ఫైర్**

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించారని ఆయన ఆరోపించారు. అదే సమయంలో 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులు, పేదలు ఇబ్బందులు పడుతున్నా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. (వివరాలు 2లో..)





## కేటీఆర్‌కు అరుదైన గుర్తింపు

**మరో అంతర్జాతీయ వేదిక ఆహ్వానం**

**లక్సెంబర్గ్ వెంచర్ డేస్ ఇన్విటేషన్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఆహ్వానం అందింది. యూరప్‌లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్, పెట్టుబడుల రంగానికి కీలక వేదికగా నిలిచే లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసం చేయాలని నిర్వాహకులు ఆయనను ఆహ్వానించారు. లక్సెంబర్గ్‌లో అక్టోబర్ 14, 15 తేదీల్లో జరగనున్న ఈ కార్యక్రమాన్ని లక్స్‌ఇన్నోవేషన్, క్సెంబర్గ్ ప్రైవేట్ ఈక్విటీ అండ్ వెంచర్ క్యాపిటల్ అసోసియేషన్ నిర్వహిస్తున్నాయి. (వివరాలు 2లో..)



## బెంగాల్ ఆత్మకు అద్దం దుర్గాపూజ

**సంస్కృతిపై కొత్త రాజకీయ పోరు?**

**పండుగపై మొదలైన కొత్త చర్చ**

5లో..

**మమత బెనర్జీపై బీజేపీ మాస్టర్ స్ట్రోక్**

బెంగాల్‌లో దుర్గాపూజ మళ్లీ రాజకీయ కేంద్రంగా మారుతోంది. దేవి పూజ చుట్టూ కాదు.. బెంగాల్ సంస్కృతికి అర్థం చెప్పే హక్కు ఎవరిదన్న దానిపైనే కొత్త పోరు మొదలైంది. ఇన్నాళ్లు దుర్గాపూజను బెంగాలీ అస్మిత, కళ, ఆహారం, సామాజిక వైవిధ్యానికి ప్రతీకగా మమతా బెనర్జీ ముందుకు తీసుకెళ్లారు. ఇప్పుడు అదే పండుగను సనాతని హిందూ గుర్తింపు, సంప్రదాయ గర్వం చుట్టూ మలచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్న చర్చ మొదలైంది. పూజా పందిళ్లలో థీమ్‌లు, ఆహారపు అలవాట్లు, సంప్రదాయాలపై మొదలైన వివాదం ఈ రాజకీయ లెక్కలకు మరింత పదును పెడుతోంది. అసలు టార్గెట్ దుర్గాపూజ కాదు.. 'బెంగాలీ సంస్కృతి కాపలాదారు'గా మమతకు ఉన్న ఇమేజ్‌నేనా? అన్న ప్రశ్న ఇప్పుడు ముందుకొస్తోంది. మమతా మోడల్‌కు భిన్నంగా బీజేపీ సనాతని కథనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే.. బెంగాల్ రాజకీయాల్లో కొత్త సాంస్కృతిక సమీకరణం మొదలయ్యే అవకాశం ఉంది. అంటే ఇది పందిళ్ల పోరు కాదు.. బెంగాల్ ఆత్మను ఎవరు నిర్వచిస్తారన్న అసలైన రాజకీయ పోరు.




## తెలంగాణ రాజకీయాల్లో అసలేం జరుగుతోంది?

**పీసీసీ చీఫ్‌గా పొన్నం ప్రభాకర్ ఎంట్రీ!?**

**వెయ్యి రోజుల ముంగిట.. మూడు పార్టీల మూడో లెక్క!**

వెయ్యి రోజుల పాలన గడప దగ్గర తెలంగాణ కాంగ్రెస్‌లో అసలు రాజకీయ ఆట మొదలైంది. బయట బీఆర్ఎస్, బీజేపీ నుంచి సవాళ్లు కనిపిస్తున్నా.. కాంగ్రెస్‌కు పెద్ద పరీక్ష మాత్రం ఇంటి లోపలే ఉంది. పీసీసీ చీఫ్‌గా పొన్నం ప్రభాకర్ పేరు వినిపించడం, ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కేబినెట్‌లో చోటు కల్పించే అవకాశం తెరపైకి రావడంతో పార్టీ భవిష్యత్ సమీకరణాలపై ఆసక్తి పెరిగింది. ఇది కేవలం పదవుల మార్పు కాదు.. 2028 ఎన్నికలకు ముందే కాంగ్రెస్ రాజకీయ యంత్రాంగాన్ని రీసెట్ చేసే ప్రయత్నంగా కనిపిస్తోంది. మహేశ్‌కుమార్‌గౌడ్ మంత్రిగా వస్తే పొన్నంకు పీసీసీ పగ్గాలు దక్కే అవకాశం.. అటు రేవంత్‌రెడ్డికి పార్టీపై మరింత పట్టు, ఇటు సీనియర్లకు కొత్త సమీకరణాలు ఏర్పడే పరిస్థితి రావచ్చు. అయితే ఒకరికి పదవి అంటే మరొకరికి అసంతృప్తి అన్న ప్రమాదం కూడా ఉంది. ఈ మార్పులు కాంగ్రెస్‌కు బలం చేకూరుస్తాయా? లేక వర్గపోరుకు కొత్త తలుపులు తెరుస్తాయా? ఇదే ఇప్పుడు కీలక ప్రశ్న. మరోవైపు బీఆర్ఎస్ 'వెయ్యి రోజుల విధ్వంసం' అంటూ కాంగ్రెస్‌పై దాడికి సిద్ధమవుతోంది. బీజేపీ కూడా కొత్త నాయకత్వం, కొత్త వ్యూహంతో మూడో శక్తిగా ఎదగాలని చూస్తోంది. దీంతో వెయ్యి రోజుల ముంగిట తెలంగాణలో మూడు పార్టీల లెక్కలు మారుతున్నాయి. ఎవరికి లాభం.. ఎవరికి నష్టం.. ఎవరి వ్యూహం 2028 దిశను మార్చబోతోంది? ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అసలు టాపిక్.

# కేసీఆర్ చాలా మంచోడు

- కొండా సురేఖ ప్రశంసలు
- బీఆర్ఎస్ వైపు అడుగులు?



కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ.. వరుస ఇంటర్వ్యూల్లో సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రశంసలు కురిపించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీసింది. గతంలో బీఆర్ఎస్‌లో పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్న సురేఖ.. కేసీఆర్ చాలా మంచి వ్యక్తి అని చెప్పారు. తమను కలిసిన ప్రతిసారీ చాలా గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం కోరిన వెంటనే కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ సమయంలో మురళికి ఎమ్మెల్సీ పదవి దక్కకుండా కడియం శ్రీహరి సహా కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు ప్రయత్నించినా.. కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని ఇతరుల నామినేషన్లు ఉపసంహరింపజేసి మురళిని ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా గెలిపించారని సురేఖ వెల్లడించారు.

### కాంగ్రెస్‌పై అసంతృప్తి.. బీఆర్ఎస్‌పై ఆసక్తి?

కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న కొండా సురేఖ..మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన తర్వాత కేసీఆర్ పాలన, వ్యక్తిత్వాన్ని ప్రశంసించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ కేసీఆర్‌ను సానుకూలంగా ప్రస్తావించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందా? అనే చర్చ మొదలైంది. ముఖ్యంగా కాంగ్రెస్‌లో కొండా సురేఖకు ఎదురైన పరిణామాల నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కేసీఆర్‌తో గతంలో తనకు ఉన్న అనుబంధాన్ని ఆమె బహిరంగంగా ప్రస్తావించడంతో.. కొండా సురేఖ, కొండా మురళి దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారా? అనే ప్రచారం తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. అయితే ఇప్పటివరకు బీఆర్ఎస్‌లో చేరికపై కొండా దంపతుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో సురేఖ వ్యాఖ్యలు కేవలం గత అనుభవాలపై ప్రశంసలేనా.. లేక రాజకీయంగా కొత్త అడుగుకు సంకేతమా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# బీఆర్ఎస్‌లోకి నో ఎంట్రీ

- సురేఖకు గులాబీ తలుపులు బంద్
- తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం



మంత్రివర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్ అయిన తర్వాత ఆమె బీఆర్ఎస్‌లో చేరుతారనే ప్రచారం ఊపందుకున్న నేపథ్యంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి తీసుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. చివరకు ఆమెను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వబోమని తీవ్రంగా వ్యాఖ్యానించారు. గతంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన నేతలను తిరిగి పార్టీలోకి తీసుకునే విషయంలో తమ పార్టీ కఠినంగా ఉంటుందని తెలిపారు. ఒకరిద్దరిని మినహాయిస్తే మిగతా నేతలకు గులాబీ తలుపులు తెరవబోమని స్పష్టం చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సురేఖను బర్తరఫ్ చేయడం కాదని, సీఎం రేవంత్‌రెడ్డినే పదవి నుంచి తొలగించాలని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కొండా కుటుంబం ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసినా వాటిపై చర్యలు తీసుకోకుండా సురేఖపై చర్యలు తీసుకున్నారని విమర్శించారు.

### సురేఖ వ్యాఖ్యలపై విచారణకు డిమాండ్

కాంగ్రెస్ ప్రభుత్వంపై కొండా సురేఖ, సుస్మిత చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకుంటోందని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఆధారాలు పంపినట్లు తెలిపారు. అయితే ఇవన్నీ జగదీశ్‌రెడ్డి చేసిన ఆరోపణలేనని, వాటిపై సంబంధిత దర్యాప్తు సంస్థల అధికారిక నిర్ధారణ ఇంకా వెలువడలేదని గమనించాలి. సురేఖపై బీఆర్ఎస్ వైఖరి మాత్రం స్పష్టమని ఆయన వ్యాఖ్యలు చెప్పకనే చెబుతున్నాయి. బీఆర్ఎస్‌లోకి సురేఖకు అవకాశం లేదన్న సంకేతాన్ని మాజీ మంత్రి బహిరంగంగానే ఇచ్చారు. దీంతో కాంగ్రెస్‌లో బర్తరఫ్ తర్వాత సురేఖ తదుపరి రాజకీయ అడుగు ఏమిటన్న దానిపై ఆసక్తి మరింత పెరిగింది.

# సురేఖపై వేటు సరే

- పొంగులేటిపై ఎప్పుడు?
- 22ఏ భూములపై హరీశ్‌రావు ఫైర్



బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించారని ఆయన ఆరోపించారు. అదే సమయంలో 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులు, పేదలు ఇబ్బందులు పడుతున్నా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను హడావుడిగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు కూడా గతంలో 22ఏ పరిధిలోకి వచ్చిందని ప్రస్తావించిన హరీశ్‌రావు.. తన ఇంటి విషయంలో ఆంక్షలు తొలగించుకున్న సీఎం పేదల భూముల విషయంలో ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

### 42,867 ఎకరాల భూములు బందీ: హరీశ్‌రావు

భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులుగా పేర్కొంటూ అవమానించడం సరికాదని హరీశ్‌రావు విమర్శించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే 42,867 ఎకరాల రైతుల పట్టా భూములు 22ఏ జాబితాలో చిక్కుకున్నాయని ఆయన పేర్కొన్నారు. నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో బ్యాంకులు రుణాలు ఇవ్వక రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలు, రైతుల భూములను 22ఏ జాబితా నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూ సమస్యలపై రేవంత్‌రెడ్డి రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కలిసి అసెంబ్లీ ముట్టడికి దిగుతామని హరీశ్‌రావు హెచ్చరించారు. "ఇది ఇందిరమ్మ రాజ్యమా..కబ్జాల రాజ్యమా?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే హరీశ్‌రావు చేసిన ఆరోపణలపై సంబంధిత ప్రభుత్వం, మంత్రుల అధికారిక వివరణ ఈ కథనంలో లేదు.

# హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలే

## సురేఖపై వేటు.. క్రమశిక్షణే కారణం!

- బర్తరఫ్ బాధాకరమే.. క్రమశిక్షణ ముఖ్యం
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు



కొండా సురేఖను తెలంగాణ మంత్రివర్గం నుంచి తొలగించిన వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సురేఖ బర్తరఫ్ బాధాకరమైన పరిణామమేనని, అయితే కాంగ్రెస్‌లో పార్టీ క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ఢిల్లీలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను ఆమె వెంటనే ఖండించాల్సిందని అభిప్రాయపడ్డారు. సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడాన్ని ఏఐసీసీ తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. క్రమశిక్షణ కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగానే కాంగ్రెస్ అధిష్ఠానం చర్య తీసుకుందని వివరించారు. పార్టీ నిర్ణయాలు, నాయకత్వంపై ఎవరైనా బహిరంగంగా హద్దులు దాటి మాట్లాడితే ఉపేక్షించేది లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అయితే సురేఖ కాంగ్రెస్‌లోనే కొనసాగాలని తాము కోరుకుంటున్నామని, ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో అవకాశాలు లభించే అవకాశం ఉందని సూచించారు.

### పార్టీ వేదికలున్నాయి.. బహిరంగ వ్యాఖ్యలు వద్దు

పార్టీలో నాయకులు తమ అభిప్రాయాలు చెప్పేందుకు అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని మహేశ్ గౌడ్ తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి తదితరులను సంప్రదించి సమస్యలను చర్చించుకోవచ్చని చెప్పారు. ఈ వేదికలను పక్కనపెట్టి నేరుగా మీడియా ముందుకు వచ్చి పార్టీపై వ్యాఖ్యలు చేయడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. "పార్టీ లైన్ దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు" అన్న స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అదే సమయంలో భవిష్యత్తులో కాంగ్రెస్ బీసీలకు మరింత ప్రాధాన్యత ఇస్తుందని హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో మహేశ్ గౌడ్ వ్యాఖ్యలు పార్టీ అధిష్ఠానం వైఖరిని స్పష్టం చేస్తున్నాయి.

# సురేఖ బర్తరఫ్.. డీకే అరుణ ఆవేదన

- అప్పుడు సంతోషించా.. ఇప్పుడు బాధగా ఉంది
- తోటి మహిళా నేతకు అన్యాయం జరిగిందన్న ఎంపీ



కొండా సురేఖను తెలంగాణ మంత్రివర్గం నుంచి తొలగించిన వ్యవహారంపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సురేఖతో కలిసి మంత్రిగా పనిచేసిన విషయాన్ని గుర్తుచేసుకున్న ఆమె.. ఒక మహిళా నాయకురాలు ఎన్నో రాజకీయ ఒడిదుడుకులు ఎదుర్కొని మంత్రి స్థాయికి రావడం సాధారణ విషయం కాదన్నారు. 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో తామిద్దరం కలిసి పనిచేశామని తెలిపారు. అప్పట్లో సురేఖ మంత్రిగా తెలంగాణకు సేవలందించడం చూసి సంతోషించానని, ఇప్పుడు అదే నాయకురాలిని కేబినెట్ నుంచి తొలగించడం తనకు ఎంతో బాధ కలిగించిందని చెప్పారు. సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలకు సురేఖను బాధ్యురాలిని చేస్తూ మంత్రివర్గం నుంచి తొలగించడం సమర్థనీయం కాదని డీకే అరుణ అభిప్రాయపడ్డారు. సీనియర్ మహిళా నేతపై ఇలాంటి చర్య తీసుకోవడం సరైన నిర్ణయం కాదని విమర్శించారు.

### బీసీ మహిళను తొలగించడమే గౌరవమా?

కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నారని డీకే అరుణ గుర్తుచేశారు. అయితే ఓ బీసీ మహిళా మంత్రిని కేబినెట్ నుంచి తొలగించడం ద్వారా కాంగ్రెస్‌కు బీసీలపై ఉన్న గౌరవం ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోందని ఆమె విమర్శించారు. సురేఖ బర్తరఫ్‌కు కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలే కారణమని ఆరోపించారు. వ్యక్తిగత వ్యాఖ్యల విషయంలో సురేఖపై చర్య తీసుకోవడం కంటే పార్టీలోని సమస్యలను అంతర్గతంగా పరిష్కరించాల్సిందని సూచించారు. ఇదే సమయంలో సురేఖను బీజేపీలోకి ఆహ్వానించే అంశంపై తమ మధ్య ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదని డీకే అరుణ స్పష్టం చేశారు. దీంతో సురేఖ భవిష్యత్ రాజకీయ ప్రయాణంపై జరుగుతున్న ఊహాగానాల మధ్య డీకే అరుణ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాంగ్రెస్ నిర్ణయంపై ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలకు ఇవి మరింత బలం చేకూర్చాయి.

# థేమ్స్ తీరాన గంగా హారతి

- గంగ ఎక్కడైనా.. భక్తి ఒక్కటేనా?
- హర్ష్ గోయెంకా ఘాటు ప్రశ్నలు



'ఫ్రాన్స్‌లోని సీన్ నదిపై కుంభమేళా నిర్వహిస్తారా? ఇటలీలోని లేక్ కోమోలో కశ్మీర్ దాల్ లేక్ శికారా పడవలు నడుపుతారా? లండన్ హైడ్ పార్క్‌లో పుష్కర్ ఒంటెల జాతర పెడతారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. సంప్రదాయాలకు వాటి మూల ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని గుర్తించాలన్న భావన ఆయన వ్యాఖ్యల్లో కనిపించింది.

### భక్తికి భౌగోళిక హద్దులుంటాయా?

హర్ష్ గోయెంకా వ్యాఖ్యలపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వచ్చాయి. కొందరు ఆయన ప్రశ్నతో ఏకీభవించగా.. మరికొందరు గంగా హారతిని థేమ్స్ తీరంలో నిర్వహించడాన్ని గట్టిగా సమర్థించారు. "మనసు మంచిదైతే గంగ ఎక్కడైనా ఉంటుంది" అనే భావనతో పలువురు స్పందించారు. మతపరమైన ఆచారాల్లో ప్రతీకలకు ప్రాధాన్యం ఉంటుందని మరికొందరు గుర్తుచేశారు. పూజల్లో గణేశుడికి ప్రతీకగా బియ్యం వంటి వస్తువులను ఉపయోగించినట్లే.. థేమ్స్‌ను గంగకు ప్రతీకగా భావించి హారతి చేయవచ్చని వాదించారు. భారత్‌లోనే గంగా కాని నదులు, చెరువుల వద్ద గంగా హారతి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఉదాహరణలు ఇచ్చారు.

### ప్రపంచ వేదికపై భారతీయ సంప్రదాయం

మరోవైపు ఈ కార్యక్రమాన్ని భారతీయ సంస్కృతికి అంతర్జాతీయ గుర్తింపు పెరుగుతున్న సంకేతంగా కొందరు నెటిజన్లు అభివర్ణించారు. గంగా హారతి ఇక ఒక ప్రాంతానికే పరిమితమైన ఆచారం కాదని.. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు తమ సంస్కృతిని కొనసాగించేందుకు ఇది ఒక మార్గమని వ్యాఖ్యానించారు. "నమ్మితే గంగ.. నమ్మకపోతే థేమ్స్" అంటూ మరికొందరు ఈ చర్చను ఒక్క వాక్యంలో ముగించారు. అన్ని నదులు చివరకు సముద్రంలో కలుస్తాయని, ప్రకృతి పరంగా నదులన్నింటికీ అనుబంధం ఉందని మరో వర్గం పేర్కొంది. దీంతో ఈ వ్యవహారం కేవలం ఒక హారతి కార్యక్రమం చుట్టూ నడిచిన వివాదంగా కాకుండా సంప్రదాయం, విశ్వాసం, ప్రతీక, సంస్కృతికి భౌగోళిక హద్దులు ఉండాలా? అన్న పెద్ద చర్చగా మారింది.

# కేటీఆర్‌కు అరుదైన గుర్తింపు

- మరో అంతర్జాతీయ వేదిక ఆహ్వానం
- లక్సెంబర్గ్ వెంచర్ డేస్ ఇన్విటేషన్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఆహ్వానం అందింది. యూరప్‌లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్, పెట్టుబడుల రంగానికి కీలక వేదికగా నిలిచే లక్సెంబర్గ్ వెంచర్ డేస్-2026లో కీలకోపన్యాసం చేయాలని నిర్వాహకులు ఆయనను ఆహ్వానించారు. లక్సెంబర్గ్‌లో అక్టోబర్ 14, 15 తేదీల్లో జరగనున్న ఈ కార్యక్రమాన్ని లక్స్‌ఇన్నోవేషన్, క్సెంబర్గ్ ప్రైవేట్ ఈక్విటీ అండ్ వెంచర్ క్యాపిటల్ అసోసియేషన్ నిర్వహిస్తున్నాయి. ఆసియా, యూరప్ దేశాల్లో పెట్టుబడుల విధానాలు, పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణి, స్టార్టప్ వ్యవస్థాపకుల అంచనాలు, పెట్టుబడి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యంపై ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక సెషన్‌లో కేటీఆర్ మాట్లాడనున్నారు. భారత్‌ను అంతర్జాతీయ పెట్టుబడులు, ఆవిష్కరణల వ్యవస్థతో అనుసంధానించడంలో ఆయన అనుభవం ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

### వెంచర్ క్యాపిటల్ దిగ్గజాలతో సమావేశాలకు అవకాశం

ఈ సదస్సుకు యూరప్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ పెట్టుబడిదారులు, వెంచర్ క్యాపిటల్ సంస్థలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, విధాన నిర్ణేతలు హాజరుకానున్నారు. గత ఏడాది జరిగిన కార్యక్రమానికి 28 దేశాల నుంచి 3,400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారిలో 300 మందికి పైగా పెట్టుబడిదారులు, 110 వెంచర్ క్యాపిటల్ ఫండ్ల ప్రతినిధులు ఉన్నారు. యూరప్ ఇన్వెస్ట్మెంట్ ఫండ్, నాటో ఇన్నోవేషన్ ఫండ్ వంటి సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఈ ఏడాది యూరప్ బిజినెస్ యాంగిల్ నెట్వర్క్ వార్షిక సమావేశంతో పాటు డిఫెన్స్ వెంటర్ డే వంటి ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ వేదిక ద్వారా కేటీఆర్‌కు అంతర్జాతీయ పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్యామిలీ ఆఫీసులు, వెంచర్ క్యాపిటలిస్టులతో నేరుగా చర్చించే అవకాశం లభించనుంది. స్టార్టప్‌లు, సాంకేతికత, పెట్టుబడులు, ఆవిష్కరణలపై కేటీఆర్‌కు అంతర్జాతీయంగా వస్తున్న గుర్తింపుల్లో లక్సెంబర్గ్ వెంచర్ డేస్ ఆహ్వానం మరో కీలక పరిణామంగా నిలిచింది.



# ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ జలమయం.. ప్రయాణికుల అవస్థలు

## భారీ వర్షంతో విమాన సేవలకు తీవ్ర అంతరాయం

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో వర్షం ప్రయాణికులకు చుక్కలు చూపించింది. భారీ వర్షంతో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రవేశ ద్వారాల వద్ద నీరు భారీగా చేరింది. దీంతో ప్రయాణికులు ప్యాంట్లు పైకి మడుచుకుని, లగేజీ ట్రాలీలను నీటిలో తోసుకుంటూ గేట్ల వైపు వెళ్లాల్సి వచ్చింది. కొందరు నీరు తగ్గే వరకు దాదాపు అరగంటపాటు అక్కడే నిలబడిపోయారు. ఎయిర్‌పోర్ట్ బయట పరిస్థితి ఇలా ఉంటే.. లోపల విమాన సర్వీసులపై కూడా వర్షం ప్రభావం పడింది. ఢిల్లీకి రావాల్సిన పలు విమానాలు ఇతర నగరాలకు దారి మళ్లాయి. భారీ వర్షం కారణంగా రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తాయి. ఎయిర్‌పోర్ట్ వద్ద నీటిముంపు దృశ్యాలు ప్రయాణికుల ఇబ్బందులను స్పష్టంగా చూపించాయి. మరోవైపు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసి మరిన్ని వర్షాలకు హెచ్చరించింది. ఎయిర్‌పోర్ట్ గేట్ల వద్ద వరదను తలపించే దృశ్యాలు దేశ రాజధాని ఢిల్లీలో భారీ వర్షం కురవడంతో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని కొన్ని ప్రాంతాలు నీటమునిగాయి. ఎయిర్‌పోర్ట్ ఎంట్రీ గేట్ల వద్ద నీరు భారీగా చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్యాంట్లు పైకి మడుచుకుని, లగేజీ ట్రాలీలను నీటిలో తోసుకుంటూ గేట్ల వైపు వెళ్లిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రయాణికులు సుమారు అరగంటపాటు నీటి మట్టం తగ్గే వరకు వేచి ఉన్నట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం కూడా ఇలాంటి పరిస్థితి చూశామని కొందరు ప్రయాణికులు గుర్తుచేసుకున్నారు. ఈసారి వర్షం మరింత తీవ్రంగా ఉందని చెప్పారు.

### భారీ వర్షంతో విమానాల దారి మళ్లింపు

ఎయిర్‌పోర్ట్‌లో నీటిముంపు ప్రభావం విమాన కార్యకలాపాలపై కూడా పడింది. ఢిల్లీకి రావాల్సిన ఐదు విమానాలను జైపూర్‌కు, నాలుగు విమానాలను లక్నోకు మళ్లించారు. అహ్మదాబాద్, చండీగఢ్‌లకు ఒక్కో విమానాన్ని దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో కూడా నీటిముంపు నమోదైంది. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం.. పలామ్‌లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల మధ్య 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నజఫ్‌గఢ్‌లో 8.30 నుంచి 11.30 గంటల మధ్య 0.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇతర పర్యవేక్షణ కేంద్రాల్లో ఈ సమయాల్లో పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు.

### ఎల్లో అలర్ట్.. మరింత వర్షానికి హెచ్చరిక

భారీ వర్షాల నేపథ్యంలో ఢిల్లీలో ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. లోతట్టు ప్రాంతాలు, అండర్‌పాస్‌లలో నీటిముంపు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం, ప్రజా రవాణాలో ఆలస్యాలు తలెత్తే అవకాశం ఉందని తెలిపింది. ప్రయాణికులు బయటకు వెళ్లే ముందు ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించాలని సూచించింది. ఉరుములు, మెరుపుల సమయంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. మధ్యాహ్నం 2.15 నుంచి 4.15 గంటల మధ్య పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తదుపరి గంటల్లో కొన్ని ప్రాంతాల్లో 50-100 మిల్లీమీటర్ల భారీ వర్షం, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# నీటి వాటాపై తేలని పంచాయితీ

- కృష్ణా జలాలపై మళ్లీ ప్రతిష్ఠంభన
- 66:34పై ఏపీ, 50:50పై తెలంగాణ పట్టు



కృష్ణా జలాల పంపిణీపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య మరోసారి ప్రతిష్ఠంభన ఏర్పడింది. 2026 27 నీటి సంవత్సరానికి సంబంధించి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ముగ్గురు సభ్యుల కమిటీ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగినా నీటి వాటాపై ఎలాంటి ఏకాభిప్రాయం కుదరలేదు. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే పరిస్థితుల్లోనూ రెండు రాష్ట్రాలు తమ పాత వాదనలకే కట్టుబడ్డాయి. 201516లో తాత్కాలికంగా అంగీకరించిన 66:34 నిష్పత్తి కొనసాగించాలని ఏపీ కోరుతోంది. తెలంగాణ మాత్రం 2020 నుంచి డిమాండ్ చేస్తున్న 50:50 వాటా విషయంలో వెనక్కి తగ్గడం లేదు. వరుసగా రెండు సమావేశాల్లోనూ ప్రతిష్ఠంభన కొనసాగడంతో ఈ నెల నాలుగో వారంలో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈసారి పూర్తి స్థాయి KRMB సమావేశం నిర్వహించి సమస్యకు పరిష్కారం కనుగొనాలని అధికారులు భావిస్తున్నారు.

### సాగర్, శ్రీశైలంపై పరస్పర ఆరోపణలు

నీటి పంపిణీతో పాటు శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి అనుమతి లేకుండా నీటిని తీసుకుంటున్నారంటూ రెండు రాష్ట్రాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఆగస్టు 24న జరిగిన సమావేశం తర్వాత తెలంగాణ అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏపీ నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి నీటిని తీసుకోవడం ప్రారంభించిందని అధికారులు చెబుతున్నారు. దీనికి ప్రతిగా తెలంగాణ అదే రోజు సాయంత్రం ఎడమ కాలువకు నీటిని విడుదల చేసింది. తక్కువ ఇన్‌ఫ్లో ఉన్న నేపథ్యంలో అక్టోబర్ చివరి వరకు కేవలం తాగునీటి అవసరాల కోసమే నీటిని వినియోగించాలని రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. ఈ క్రమంలో ఏపీ, తెలంగాణ చెరో 47 టీఎంసీల నీటిని కోరాయి. సెప్టెంబర్ 4నాటికి శ్రీశైలానికి జూన్ 1 నుంచి 213.6 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చింది. నాగార్జునసాగర్‌కు శ్రీశైలం నుంచి జలవిద్యుత్ ఉత్పత్తి ద్వారా వచ్చిన నీటితో కలిపి 93.1 టీఎంసీలు చేరాయి.

### ఎవరు ఎంత నీరు తీసుకున్నారు?

నీటి విడుదల విషయంలో రెండు రాష్ట్రాలు తమ వాదనలను బలంగా వినిపించాయి. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు తెలంగాణ అవసరం లేకపోయినా జలవిద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని విడుదల చేస్తోందని ఏపీ ఇంజినీర్ ఇన్ చీఫ్ కే. నరసింహమూర్తి ఆరోపించారు. దీంతో శ్రీశైలంపై ఆధారపడిన ఏపీ నీటి వినియోగానికి ఇబ్బంది ఏర్పడుతోందని చెప్పారు. తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఓ.వి. రమేష్‌బాబు ఈ వాదనను ఖండించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, హంద్రీనీవా లిఫ్టులు, కేఎసీ కెనాల్ సప్లిమెంటేషన్ ద్వారా ఏపీ ఇప్పటికే భారీగా నీటిని తీసుకుందని ఆరోపించారు. అక్టోబర్ చివరి వరకు పోతిరెడ్డిపాడు నుంచి 22 టీఎంసీలకు మించి తీసుకోకూడదన్న అంగీకారం ఉన్నా.. ఇప్పటికే 20 టీఎంసీలు వినియోగించారని తెలంగాణ చెబుతోంది. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య 66:34 నిష్పత్తి తమకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని తెలంగాణ స్పష్టం చేయడం కీలకంగా మారింది. వచ్చే KRMB పూర్తి స్థాయి సమావేశంలోనైనా ఈ ప్రతిష్ఠంభన తొలగుతుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ప్రయోజనాలు కట్?

- ఇక అంతే సంగతులు
- రాజీనామాతో తప్పించుకుంటే
- జడ్జీలపై సుప్రీంకోర్టు కీలక విచారణ

అవినీతి, దుష్ప్రవర్తన ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్యాంగ పదవుల్లోని వ్యక్తులు తొలగింపు ప్రక్రియను తప్పించుకునేందుకు రాజీనామా చేస్తే.. వారికి పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వకూడదా? అన్న అంశంపై



సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం కేంద్రం సమాధానం కోరింది. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు తమపై జరిగే పారదర్శక విచారణను ఎదుర్కోకుండా రాజీనామా చేసి ప్రయోజనాలు పొందడం సరికాదన్నది పిటిషనర్ ప్రతిక్ వోరా వాదన.

### రాజీనామా.. తొలగింపునకు ప్రత్యామ్నాయం కాదు

ఒక వ్యక్తి ఎన్నికై లేదా నియమితుడై నిర్దిష్ట కాలానికి రాజ్యాంగ పదవిలోకి వస్తే.. ఆ పదవీకాలాన్ని పూర్తి చేయడం అతని రాజ్యాంగ బాధ్యత అని పిటిషన్ పేర్కొంది. తప్పు జరిగిందన్న ఆరోపణలు వస్తే వాటిపై పారదర్శకమైన విచారణ జరగాలి. వ్యక్తిగత ఇష్టాను సారం రాజీనామా చేసి ఆ ప్రక్రియ నుంచి బయటపడే అవకాశం ఉండకూడదని అభిప్రాయపడింది. ప్రస్తుతం ఉన్న వ్యవస్థలో రాజీనామా చేసినా గతంలో లభించే అన్ని ప్రయోజనాలు దక్కుతాయనే భావన కొందరికి విచారణను తప్పించుకునే ధైర్యాన్ని ఇస్తోందని పిటిషనర్ పేర్కొన్నారు. అందువల్ల తొలగింపు లేదా అవిశ్వాస ప్రక్రియను తప్పించుకునేందుకు రాజీనామా చేసే రాజ్యాంగ పదవీధారులకు పెన్షన్, ఇతర పదవీ ప్రయోజనాలు నిలిపివేయాలని కోరారు.

### జస్టిస్ యశ్వంత్ వర్మ కేసుతో ప్రాధాన్యం

ఈ పిటిషన్‌కు అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం నేపథ్యంలో మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఢిల్లీ హైకోర్టులో పనిచేసిన సమయంలో ఆయన అధికారిక నివాసంలో కాలిపోయిన నగదు కట్టలు లభించాయన్న ఆరోపణలపై విచారణ జరిగింది. అనంతరం ఆయనపై పార్లమెంటరీ తొలగింపు ప్రక్రియకు దారితీసింది. లోక్‌సభ కమిటీ ఆరోపణలు రుజువయ్యాయని పేర్కొన్న నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజీనామా ద్వారా విచారణను ముగించే అవకాశం ఉంటే రాజ్యాంగ వ్యవస్థపై ప్రజల నమ్మకానికి దెబ్బ తగులుతుందని పిటిషన్ చెబుతోంది. జడ్జీల విషయంలో జడ్జెస్ ఇన్క్వైరీ యాక్ట్ ప్రకారం ప్రక్రియ ఉన్నప్పుడు దాన్ని ఎదుర్కోకుండా రాజీనామా చేయడం సమర్థనీయం కాదన్నది పిటిషనర్ వాదన. ఇప్పుడు కేంద్రం సమాధానం తర్వాత ఈ అంశంపై సుప్రీంకోర్టు ఎలాంటి దిశానిర్దేశాలు ఇస్తుందన్నది కీలకంగా మారింది.



# చిన్నారెడ్డి ఎవరు?

- నాటి హీరో నేడు విలన్ ఎలా అయ్యారు?
- మాజీ మంత్రిని అందేకే పక్కనపెట్టారా?
- తెలంగాణకై తొలినాటి పోరాట యోధుడు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాంగ్రెస్‌లోనే తొలి గొంతు వినిపించిన నేతల్లో జిల్లెల చిన్నారెడ్డి ఒకరని ఆయన అనుచరులు గుర్తుచేస్తున్నారు. రాష్ట్ర ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫోరం ఏర్పాటు చేసి 42 మంది ఎమ్మెల్యేల సంతకాలు సేకరించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలోనే కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి మెమోరాండం సమర్పించారు. ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీ స్థాపించినప్పటి నుంచి తాను పార్టీలోనే కొనసాగుతున్నానని, ఎన్నో ఏళ్ల రాజకీయ ప్రయాణం తర్వాత సాధించిన స్థాయిని ఒక్క నిర్ణయంతో కోల్పోయే పరిస్థితి వచ్చిందని చిన్నారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పదవి ఉన్నా లేకపోయినా తన గౌరవం తనకు ఉంటుందని స్పష్టం చేశారు.

### పదవి పోయింది.. పోరాటం మిగిలింది

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించిన తర్వాత సొంతూరులో చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. తనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలవలేదని, తాను కూడా కలిసేందుకు ప్రయత్నించలేదని చెప్పారు. తనకు ఇచ్చిన నియామక ఉత్తర్వుల్లో పదవికి నిర్దిష్ట కాలపరిమితి లేదని, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగుతుందని మాత్రమే ఉందని వివరించారు. తన కుమారుడికి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రిని ఎప్పుడూ కోరలేదన్నారు. తాజా పరిణామాలకు ఎంపీ మల్లు రవి కారణమని ఆరోపించారు. భవిష్యత్తు కార్యాచరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, ఆలోచించిన తర్వాత నిర్ణయిస్తానన్నారు. కాంగ్రెస్‌లో వీ.హనుమంతరావు తర్వాత తానే సీనియర్ నేతనని చిన్నారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ కోసం పోరాడిన నేతలను పక్కనపెట్టి అవకాశవాద రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్న విమర్శలు కూడా ఈ పరిణామంతో మళ్లీ తెరపైకి వచ్చాయి.

# ఇటలీలో కొత్త చరిత్ర!




- 1,413 రోజుల పాలనతో మెలోనీ రికార్డు
- సంక్షోభాలను దాటిన రైట్ వింగ్ సర్కార్

ఇటలీ రాజకీయ చరిత్రలో జార్జియా మెలోనీ ప్రభుత్వం కొత్త రికార్డు సృష్టించింది. 2022లో అధికారంలోకి వచ్చిన మెలోనీ.. ఇటలీ యుద్ధానంతర చరిత్రలో అత్యంత ఎక్కువ కాలం కొనసాగిన ప్రభుత్వానికి నాయకురాలిగా నిలిచారు. శుక్రవారం సెప్టెంబర్ 4న దక్షిణ ఇటలీలోని బారీ నగరంలో భారీ సభతో ఈ రికార్డును జరుపుకున్నారు. మెలోనీ ప్రభుత్వం 1,413 రోజులు పూర్తిచేసుకుని మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ రికార్డును అధిగమించింది. గత 80 ఏళ్లలో ఇటలీలో ఏకంగా 68 ప్రభుత్వాలు మారాయి. సంక్షోభాలు, మిత్రపక్షాల నుంచి నేతల వైదొలగడం వంటి కారణాలతో ప్రభుత్వాలు కూలిపోవడం అక్కడ సాధారణమే. కానీ మెలోనీ ఇప్పటివరకు తన సంకీర్ణాన్ని నిలబెట్టుకోవడంలో సఫలమయ్యారు.

### ఉద్యోగాలు పెరిగాయన్న మెలోనీ.. విమర్శలు మాత్రం

మెలోనీ నేతృత్వంలోని బ్రదర్స్ ఆఫ్ ఇటలీ పార్టీ.. లీగ్, ఫోర్జా ఇటాలియా పార్టీలతో కలిసి ప్రభుత్వం నడుపుతోంది. దాదాపు నాలుగేళ్ల పాలనలో 10 లక్షలకు పైగా అదనపు ఉద్యోగాలు, వ్యక్తిగత ఆదాయపన్నులో 21 బిలియన్ యూరోల తగ్గింపు వంటి విజయాలను ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. దేశ ఆర్థిక స్థిరత్వం మెరుగుపడిందని మెలోనీ చెబుతున్నారు. అయితే ప్రతిపక్షాలు మాత్రం ఆర్థిక స్థిరత్వం ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురాలేదని విమర్శిస్తున్నాయి. వేతనాలు పెరగలేదని, పెట్రోల్ ధరలు పెరిగాయని, ఉద్యోగ భద్రత తగ్గిందని, ఆరోగ్య వ్యవస్థ పనితీరు బలహీనపడిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

### వలసలపై కఠిన వైఖరి.. 2027పై కన్ను

మెలోనీ ప్రభుత్వం భద్రత, అక్రమ వలసల అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. ఇప్పటివరకు సుమారు 300 చట్టాలు, డిక్రీలు తీసుకురాగా.. వాటిలో ఎక్కువ భాగం భద్రతకు సంబంధించినవేనని ప్రభుత్వం చెబుతోంది. అక్రమ వలసలను అడ్డుకుంటామని ఇచ్చిన హామీతో 2022లో అధికారంలోకి వచ్చిన మెలోనీ.. తమ విధానాలతో వలసదారుల రాక 80 శాతం తగ్గిందని పేర్కొంటున్నారు. మరోవైపు ఆమెపై విమర్శలు కూడా తీవ్రంగానే ఉన్నాయి. ప్రభుత్వం పోలీసు వ్యవస్థను కఠినతరం చేస్తోందని, వలసదారులపై వ్యతిరేక వాతావరణాన్ని పెంచుతోందని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. 2027 ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బారీ సభను మెలోనీ ఎన్నికల ప్రచారానికి వేదికగా కూడా ఉపయోగించుకున్నారు. అయితే ఆమెకు కుడిపక్షంలోనే మరింత తీవ్ర వైఖరితో ఎదుగుతున్న మాజీ సైనికాధికారి నేతృత్వంలోని కొత్త పార్టీ నుంచి సవాలు ఎదురవుతోంది.



# కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఖాయం

- న్యాయవాదులు ఆందోళన చెందొద్దు
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ భరోసా

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై న్యాయవాదులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. శుక్రవారం కర్నూలు నగరంలోని 11వ వార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కర్నూలుకు హైకోర్టు బెంచ్ తప్పకుండా వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ అంశంపై తాను వ్యక్తిగతంగా ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేశానని చెప్పారు. మంత్రి నారా లోకేశ్ కూడా హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై స్పష్టత ఇచ్చారని టీజీ భరత్ పేర్కొన్నారు. బెంచ్ ఏర్పాటు అనేది న్యాయపరమైన ప్రక్రియతో పాటు నిర్దిష్ట విధానాలకు అనుగుణంగా జరగాల్సిన అంశమని వివరించారు. అందువల్ల న్యాయవాదులు తొందరపడి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం లేదని సూచించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని, దీనిపై ఇచ్చిన హామీ అమలవుతుందని భరోసా కల్పించారు. న్యాయవాదులు ఆందోళనలకు దూరంగా ఉండి ఓపికగా వ్యవహరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.



## ధర్మం, సత్యం, ప్రేమను బోధించే కృష్ణ తత్వం గొప్పది

### ఇస్కాన్ జన్మాష్టమి వేడుకల్లో కమిషనర్ తూతిక సందేశం

ప్రొద్దుటూరులో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాధ్ కృష్ణతత్వం గొప్పతనాన్ని వివరించారు. వేలాది మంది భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ మనిషి మనుగడకు, జాతి ఎదుగుదలకు ధర్మం, సత్యం, ప్రేమ ఎంతో ముఖ్యమన్నారు. ప్రపంచానికి నాగరికత నేర్పిన భారతదేశం, వేదాలకు నిలయంగా, త్యాగానికి ప్రతీకగా నిలిచిన భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని కృష్ణతత్వం ద్వారా ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. శ్రీకృష్ణ సేవలో ఇస్కాన్ సంస్థ చేస్తున్న కార్యక్రమాలను కమిషనర్ అభినందించారు. ఇస్కాన్ వ్యవస్థాపకులు శ్రీ భగవాన్ శ్రీపాదుల వారిని స్మరించుకున్నారు. అనంతరం భక్తులతో కలిసి 'కృష్ణ కృష్ణ' నామ స్మరణ చేయించారు. భక్తి సందడితో వేడుకలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమం అనంతరం కమిషనర్ శ్రీనివాస విశ్వనాధ్, ఆయన సతీమణి శైలజ దంపతులను ఇస్కాన్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. జన్మాష్టమి వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

# అది ఉద్యోగం కాదు

- గిగ్ వర్కర్ బతుకు పోరాటం!
- గంటలు పెరిగినా.. భద్రత కరువే



ేశంలో ఫుడ్ డెలివరీ, క్యాబ్ డ్రైవింగ్, ఈకామర్స్ డెలివరీ, ఇంటి సేవల వంటి గిగ్ పనులు తాత్కాలిక ఉపాధి స్థాయి దాటి చాలామందికి పూర్తి స్థాయి ఉద్యోగంగా మారిపోయాయని జనపహల్ సంస్థ నిర్వహించిన దేశవ్యాప్త సర్వే వెల్లడించింది. పది నగరాల్లో 1,000 మంది ప్లాట్‌ఫామ్ కార్మికులను సర్వే చేసిన సంస్థ.. వారి పని పరిస్థితులపై ఆందోళనకర అంశాలను బయటపెట్టింది. దాదాపు 57 శాతం మంది వారానికి 49 గంటలకు పైగా పనిచేస్తుండగా, సుమారు 23 శాతం మంది 70 గంటలకు మించి పనిచేస్తున్నారు. ప్లాట్‌ఫామ్‌లపై ఏడాదికి పైగా కొనసాగుతున్నవారి సంఖ్య 72.3 శాతంగా ఉంది. వీరిలో 38.4 శాతం మంది రెండేళ్లకు పైగా, 18.4 శాతం మంది ఐదేళ్లకు పైగా ఇదే పనిపై ఆధారపడి ఉన్నారు.

### ని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కూడా లేవు

గిగ్ కార్మికులకు ఎక్కువ పని గంటలతో పాటు ప్రాథమిక సౌకర్యాల కొరత తీవ్రంగా ఉందని నివేదిక పేర్కొంది. 74.6 శాతం మందికి విశ్రాంతి తీసుకునే ప్రదేశం లేదు. 53.8 శాతం మంది తాగునీటిని సొంత డబ్బులతో కొనుగోలు చేస్తున్నారు. 66.2 శాతం మంది పని సమయంలో అరుదుగా లేదా అసలు విరామమే తీసుకోవడం లేదు. దాదాపు 43.9 శాతం మంది డబ్బులు చెల్లించి పబ్లిక్ టాయిలెట్లు ఉపయోగిస్తున్నారు. మరో 15 శాతం మందికి పని సమయంలో టాయిలెట్ సౌకర్యమే లేదు. రోడ్డు ప్రమాదాల ముప్పు కూడా ఎక్కువగానే ఉంది. 62.2 శాతం మంది ప్రమాదానికి తృటిలో తప్పించుకున్న అనుభవం చెప్పగా, 27 శాతం మంది పని సమయంలో ట్రాఫిక్ ప్రమాదాలకు గురయ్యారు. 38 శాతం మంది రోడ్ల దుస్థితి కారణంగా గాయపడ్డారు. మరోవైపు 34.1 శాతం మంది వేధింపులు, దుర్వినియోగం లేదా హింసను ఎదుర్కొన్నారు.

### ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నా.. రక్షణ లేదు

అధిక పని గంటలు, ఎండ, కాలుష్యం, రోడ్లపై నిరంతర ప్రయాణం కారణంగా కార్మికుల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని సర్వే తెలిపింది. 64.5 శాతం మందికి అలసట, నిద్ర సమస్యలు, 47.4 శాతం మందికి కండరాలు, ఎముకల నొప్పులు, 41.1 శాతం మందికి ఒత్తిడి, ఆందోళన ఎదురవుతున్నాయి. 30 శాతం మంది కంటి సమస్యలు, 26.5 శాతం మంది శ్వాస సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ 68.4 శాతం మందికి ప్లాట్‌ఫామ్ సంస్థల నుంచి ఆరోగ్య సహాయం అందడం లేదు. ఈ పరిస్థితిని మార్చేందుకు గిగ్ కార్మికులను చట్టపరంగా కార్మికులుగా గుర్తించాలని జనపహల్ డిమాండ్ చేసింది. టాయిలెట్లు, తాగునీరు, విశ్రాంతి ప్రదేశాలు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు వృత్తి భద్రతా ప్రమాణాలు, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలు, కార్మికుల హక్కులకు చట్టపరమైన రక్షణ కల్పించాలని సూచించింది.



# ఉత్తమ టీచర్లుగా 173 మంది

- గురుపూజోత్సవం సందర్భంగా సత్కారం

రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో విశిష్ట సేవలు అందించిన 173 మంది ఉపాధ్యాయులను 2026 సంవత్సరానికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. గురుపూజోత్సవం సందర్భంగా ఈ నెల 5న విజయవాడలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వారికి అవార్డులు అందజేయనున్నారు. పాఠశాల విద్యాశాఖ నుంచి 79 మంది, ఇంటర్ విద్య నుంచి 24 మంది, సాంకేతిక విద్య నుంచి 14 మంది, ఉన్నత విద్య నుంచి 56 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, లెక్చరర్లు, ప్రిన్సిపాళ్లను వివిధ విభాగాల నుంచి గుర్తిస్తూ విద్యాశాఖ జీవో జారీ చేసింది. రాష్ట్రస్థాయి కమిటీ చేసిన సిఫార్సుల ఆధారంగా అవార్డులను ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రతిభతో పాటు విద్యారంగానికి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక ప్రక్రియ పూర్తిచేశారు. అవార్డు గ్రహీతలకు ప్రభుత్వం ప్రశంసాపత్రంతో పాటు రూ.20 వేల నగదు బహుమతి అందించనుంది. గురువుల సేవలను గుర్తించి గౌరవించేలా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



# సొంత ఊరి రుణం తీర్చుకునే దిశగా దగ్గుబాటి కుటుంబం

- కారంచేడులో రూ.4 కోట్ల నీటి శుద్ధి కేంద్రాలు ప్రారంభం

కారంచేడులో ప్రజల ఆరోగ్యం పట్ల అంకితభావంతో దగ్గుబాటి కుటుంబం చేపట్టిన రూ.4 కోట్ల సామాజిక నీటి శుద్ధి ప్రాజెక్టు శుక్రవారం ప్రారంభమైంది. డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు సొంత గ్రామంలో నిర్మించిన నీటి శుద్ధి కేంద్రాల ద్వారా చెరువు నీటిని ఆధునిక ఓజోనేషన్ సహా పలు దశల్లో శుద్ధి చేసి నాణ్యమైన ప్యూరిఫైడ్ వాటర్‌ను 3,500 ఇళ్లకు ప్రతిరోజూ సరఫరా చేయనున్నారు. జయప్రకాష్ నారాయణ చెరువు వద్ద రెండు, హరిజనవాడ చెరువు, లైబ్రరీ చెరువు వద్ద ఒక్కో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టుకు ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.3 కోట్లు మంజూరు కాగా, దగ్గుబాటి హితేష్ చెంచురామ్ సొంత నిధుల నుంచి రూ.కోటి సమకూర్చారు. పురంధేశ్వరి, వెంకటేశ్వరరావు కృషి ప్రశంసనీయం. ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, రాంకీ ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# శ్రీకృష్ణుడి రథోత్సవం.. భక్తజన సందోహం

- భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

ప్రొద్దుటూరు శివాలయం వీధిలోని శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. ఉదయం స్వామివారికి పంచామృత, గోక్షీరాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు, వెండి కవచాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఉట్టికొట్టు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సాయంత్రం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తులను రథంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. డప్పువాయిద్యాలు, కూచిపూడి, భరతనాట్యం, చక్కభజన, కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యాదవ సేవా సంఘం అధ్యక్షుడు దాసరి బాలసుబ్బరాయుడు యాదవ్, కార్యదర్శి రాచగొల్ల వెంకటరమణ యాదవ్, కోశాధికారి శ్రీనివాసులు, యాదవ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.








# పోలీస్ క్రీడల్లో విజేతగా బాపట్ల టౌన్ సీఐ రాంబాబు

- లాన్ టెన్నిస్‌లో రాష్ట్రస్థాయి ట్రోఫీ కైవసం

బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ ఆర్. రాంబాబు రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో సత్తాచాటి లాన్ టెన్నిస్ సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ ప్రాంగణంలో సెప్టెంబర్ 1 నుంచి 4 వరకు జరిగిన 1వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2026 పోటీల్లో ఆయన ట్రోఫీ కైవసం చేసుకున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, పోలీస్ విభాగాలకు చెందిన ఎస్ఐ, ఆర్ఎస్ఐ, ఇన్‌స్పెక్టర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి 20 మందికి పైగా అధికారులు పోటీపడగా, హోరాహోరీ పోరులో అందరినీ అధిగమించి రాంబాబు విజేతగా నిలిచారు. శుక్రవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ ఉమామహేశ్వర్‌ను కలిసిన రాంబాబును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి మెడల్‌తో సత్కరించారు. ఈ విజయం జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణమన్నారు. పోలీసులకు క్రీడలు మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందిస్తాయని ఎస్పీ తెలిపారు.




## కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ మండిపాటు

### హామీల అమలుపై రేవల్లిలో ధర్నా

ఆరు గ్యారెంటీలు, 420 ఎన్నికల హామీల అమలులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ వైఫల్యాలు, నిరంకుశ పాలనను నిరసిస్తూ శుక్రవారం రేవల్లి మండలం బండరాయిపాకుల చౌరస్తా ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ భీమయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివరాం రెడ్డి మాట్లాడుతూ.. మహాలక్ష్మి కింద రూ.2,500, తులం బంగారం, మహిళలకు స్కూటీలు, రూ.4,000 పింఛన్, రైతు భరోసా, పూర్తిస్థాయి రుణమాఫీ హామీలు అమలు కాలేదని విమర్శించారు. యూరియా కొరత, సాగునీటి సమస్యలు, 22-ఏ భూసమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పాలనలో అవినీతి పెరిగిందని మండిపడ్డారు. హామీలు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగుతుందని భీమయ్య స్పష్టం చేశారు. కాంగ్రెస్ దగా పాలనను ప్రజల్లో ఎండగట్టేందుకు సెప్టెంబర్ 8 వరకు నిరసనలు, రైతు సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## 1000 రోజుల ప్రజా పాలన సంబరాలు

### రేవల్లి, ఏదులలో కాంగ్రెస్ బైక్ ర్యాలీ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తైన సందర్భంగా రేవల్లి, ఏదుల మండలాల్లో పార్టీ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు సుల్తాన్ ఆలీ, సుఖేందర్ రెడ్డి నాయకత్వంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్ష నేతగా ఉంటూ ఒక్కరోజు కూడా అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రజాధనాన్ని వినియోగించుకుంటున్న కేసీఆర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం పనిచేయకుండా జీతభత్యాలు పొందే హక్కు ఆయనకు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పాలన కొనసాగిస్తోందని పేర్కొన్నారు. 1000 రోజుల ప్రజా పాలన విజయవంతమైన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు.



## కృష్ణుడి బోధనలు ఆచరణీయం

### విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

ప్రొద్దుటూరు కామనూరులోని శ్రీ ప్రసన్న వేణుగోపాలస్వామి గో సంరక్షణ గోశాలలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో వేడుకలు జరిపారు. చిన్నారులు, భక్తులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని కోలాటాలు వేయడంతో గోశాల ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకులు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు బోధించిన సత్యం, ధర్మం, న్యాయం, నీతి వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. ధర్మమే శ్రీకృష్ణుని ప్రధాన సందేశమని పేర్కొన్నారు. గో సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో విహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సి. నాగార్జునరావు, గోసంరక్షణ అధ్యక్షుడు మారెళ్ల మల్లికార్జునరావు, నగర అధ్యక్షుడు నాగమునిరెడ్డి, జిల్లా కార్యదర్శి కాల్వ చలపతి తదితర నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# సురేఖపై చర్య.. బీసీల ఆత్మగౌరవంపై దెబ్బ!

### బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు ఫైర్

తెలంగాణలో బీసీలపై దాడులు, అన్యాయాలు పెరుగుతున్నాయని బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు ఆరోపించారు. బీసీ మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించేందుకు ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఆయన అభినందించారు. బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించకుండా అణచివేత కొనసాగుతోందని విమర్శించారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన బీసీల అణచివేతపై జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**కొండా సురేఖకు అండగా**

మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారం, క్రమశిక్షణ అంశం మాత్రమే కాదని, బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్య అని అన్నారు. సురేఖను ఒక వ్యక్తిగా చూడకుండా, రాష్ట్రంలోని బీసీ వర్గాల ప్రతినిధిగా చూడాలని స్పష్టం చేశారు. టీడీపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాల కాలంలోనూ బీసీలకు రాజకీయంగా పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని చిరంజీవులు అన్నారు. కాంగ్రెస్ సుదీర్ఘ కాలం రాష్ట్రాన్ని పాలించినా ఒక్క బీసీ వ్యక్తిని కూడా ముఖ్యమంత్రి చేయలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లు గడిచినా బీసీ ముఖ్యమంత్రి కాలేదని, ఉపముఖ్యమంత్రి పదవిలోనూ బీసీలకు తగిన ప్రాధాన్యం దక్కలేదని అన్నారు.

**క్రమశిక్షణ పేరుతో ఎందుకు?**

కాంగ్రెస్‌లో ఇతర నేతలు తీవ్ర వ్యాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నా వారిపై ఇదే స్థాయిలో చర్యలు తీసుకోలేదని చిరంజీవులు ప్రశ్నించారు. బీసీ మహిళ అయినందుకే కొండా సురేఖను లక్ష్యంగా చేసుకున్నారనే భావన బీసీ సమాజంలో ఏర్పడుతోందని అన్నారు. నిజంగా క్రమశిక్షణే ప్రమాణమైతే, అందరికీ ఒకే నిబంధన వర్తించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే కాంగ్రెస్ ప్రభుత్వం తన మంత్రివర్గంలో బీసీలకు ఎంత ప్రాతినిధ్యం కల్పించిందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఒక మంత్రి పదవి ఖాళీ అయిన నేపథ్యంలో ఆ స్థానాన్ని కూడా అగ్రవర్ణాలకే కేటాయిస్తారా అని నిలదీశారు. బీసీలకు రాజకీయ అధికారంలో సముచిత వాటా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.



**134 కులాలకు ప్రతీకగా**

కొండా సురేఖ ఏ ఉపకులానికి చెందినవారన్నది ప్రస్తుత సందర్భంలో ముఖ్యం కాదని చిరంజీవులు అన్నారు. ఆమె బీసీ మహిళగా 134 బీసీ కులాలకు ప్రతీకగా నిలుస్తున్నారని చెప్పారు. ఆమెపై తీసుకున్న చర్యను బీసీ సమాజం మొత్తం తమ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంగా చూస్తోందని స్పష్టం చేశారు. గతంలో మాదిరిగా బీసీలను ఎన్నికల సమయంలో మాత్రమే సమీకరించి, తర్వాత విస్మరించే పరిస్థితి లేదని చిరంజీవులు హెచ్చరించారు. బీసీ సమాజం ఇప్పటికే సంఘటితమైందని అన్నారు. కొండా సురేఖ వ్యవహారం ఒక్కటే కాదని, గతంలోనూ బీసీ నేతలపై చర్యలు తీసుకున్న ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేశారు.

**రాజకీయ ఎదుగుదలకు అడ్డుకట్ట వద్దు**

బీసీ వర్గాల నుంచి రాజకీయంగా ఎదగాలని ప్రయత్నించే నేతలకు అడ్డంకులు సృష్టించొద్దని చిరంజీవులు కాంగ్రెస్‌ను కోరారు. పార్టీలో గీసిన గీతలు బీసీల రాజకీయ ఎదుగుదలను అడ్డుకునేలా ఉండకూడదన్నారు. బీసీ నేతలు ఆ గీత దాటితే క్రమశిక్షణ చర్యలు, ఆధిపత్య వర్గాల నేతలు అదే చేస్తే మౌనం ఎందుకని ప్రశ్నించారు. బీసీలను తక్కువ అంచనా వేయడం ఇక సాధ్యం కాదని చిరంజీవులు స్పష్టం చేశారు. బీసీల రాజకీయ, సామాజిక ఆత్మగౌరవాన్ని గౌరవించాల్సిన సమయం వచ్చిందన్నారు. కొండా సురేఖపై తీసుకున్న చర్యను పునఃపరిశీలించి, బీసీలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# నమ్మకంగా చేరి.. నరాలు నులిమి!

### రూ.కోట్ల ఆస్తి కోసం బావ హత్య?

### మిస్టరీ ఛేదించిన పోలీసులు

విజయవాడకు చెందిన వ్యాపారి నాగ మహేశ్ హత్య కేసు తొలుత మిస్సింగ్ కేసుగా మొదలై.. చివరకు ఆస్తి కోసం పన్నిన కుట్రగా తేలింది. అక్కకు, ఆమె పిల్లలకు చెందాల్సిన కోట్ల రూపాయల ఆస్తులు మరో మహిళకు దక్కుతాయన్న ఆగ్రహం.. బావపై బామ్మర్దికి పెరిగిన కసి.. చివరకు సుపారీ హత్యకు దారితీసింది. పది రోజుల పాటు రెక్కీ నిర్వహించి, అదును చూసి కిడ్నాప్ చేసి, కారులోనే గొంతు నులిమి హత్య చేసిన నిందితులు.. మృతదేహాన్ని ఇసుక క్వారీలో పాతిపెట్టి తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరించారు. కానీ పోలీసుల దర్యాప్తు వారి నీడలా వెంటాడి అసలు మిస్టరీని ఛేదించింది.

**హత్యకు కారణమిదేనా?**

విజయవాడకు చెందిన ఉడ్ పాలిష్ వ్యాపారి చుక్క కోటి వీర నాగయ్య అలియాస్ నాగ మహేశ్ (55)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నాళ్లుగా ఆయన తెనాలికి చెందిన ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఈ వ్యవహారంపై బావమరిది పగడాల రాజేశ్ పలుమార్లు



మహేశ్‌ను పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినా ఫలితం లేకపోయింది. మహేశ్ తన వ్యాపార కార్యకలాపాలను క్రమంగా తెనాలికి మార్చడంతోపాటు అక్కడే ఓ నివాసం తీసుకుని ఆ మహిళతో కలిసి ఉండసాగాడు. ఇదే సమయంలో విజయవాడలోని కోట్ల రూపాయల విలువైన ఆస్తులను విక్రయించి.. తెనాలిలో ఉంటున్న మహిళకు ఖరీదైన భవనం కొనివ్వాలని మహేశ్ ప్రయత్నిస్తున్నాడని రాజేశ్ తెలుసుకున్నాడు. అక్కకు, ఆమె పిల్లలకు చెందాల్సిన ఆస్తులన్నీ మరో మహిళకు వెళ్లిపోతాయని భావించిన అతడు తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. ఆ ఆగ్రహమే చివరకు హత్యకు కుట్రగా మారింది.

**సుపారీకి రూ.4 లక్షల ఒప్పందం**

రాజేశ్ తన స్నేహితుల ద్వారా బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఓలేరుకు చెందిన కొమరబత్తిన సందీప్, బుస్సా సంజయ్, కొప్పుల అపర్ణ అలియాస్ బుజ్జీ, దేవరకొండ మారుతి వరప్రసాద్‌లను సంప్రదించాడు. బావ మహేశ్‌ను హత్య చేసేందుకు వారితో రూ.4 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. గుంటూరులో ఓ కారును అద్దెకు తీసుకున్న నిందితులు.. ద్విచక్రవాహనంపై వెళుతున్న మహేశ్ ను సోమసుందరపాలెం వద్ద అడ్డుకున్నారు. అనంతరం అతడిని బలవంతంగా కారులోకి ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. కరకట్టపై రేపల్లె వైపు కారులో వెళ్తుండగా.. అదే కారులో మహేశ్ గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

**ఒక్క ఫిర్యాదుతో బట్టబయలైన కుట్ర**

మహేశ్ అదృశ్యమైన నేపథ్యంలో ఆగస్టు 30న అతడితో కలిసి ఉంటున్న మహిళ తెనాలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ నాయుబ్ రసూల్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మొదట కనిపించని ఆధారాలను ఒక్కొక్కటిగా జోడిస్తూ పోలీసులు ముందుకు సాగారు. చివరకు మహేశ్ హత్య వెనుక బావమరిది రాజేశ్ పాత్రను గుర్తించి.. సుపారీ గ్యాంగ్ వరకు దర్యాప్తును విస్తరించారు.

## బీసీలకు పదవులిచ్చింది నేను

### కుటుంబ గౌరవంపై వ్యాఖ్యలు సహించనన్న రాచమల్లు



ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి బీసీలకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యం కల్పించడంలో తాను ముందున్నానని అన్నారు. దొరసానిపల్లె లోని నివాసంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన హయాంలో భీమునిపల్లె లక్ష్మీదేవిని మున్సిపల్ చైర్మన్‌గా, శేఖర్ యాదవ్‌ను ఎంపీపీగా, జింకా విజయలక్ష్మికి పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌గా, రమేష్ యాదవ్‌కు ఎమ్మెల్సీగా, యాలం తులశమ్మకు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా అవకాశం కల్పించేందుకు సహకరించానన్నారు. పలువురు బీసీలకు కౌన్సిలర్, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులు దక్కేలా కృషి చేశానని తెలిపారు. రాజకీయ విమర్శలను స్వీకరిస్తా నని, కానీ కుటుంబ గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను సహించబోనని స్పష్టం చేశారు. బీసీల సంక్షేమానికి అన్ని వర్గాలు ఏకతాటిపైకి రావాలని మాజీ ఎంపీపీ శేఖర్ యాదవ్ కోరారు. మహిళలను గౌరవిస్తూ మాట్లాడాలని లక్ష్మీదేవి సూచించారు. స్థానిక ఎన్నికల్లో ప్రజాతీర్పు తేలుతుందని రాచమల్లు అన్నారు.

# అక్రమ ఇసుక తవ్వకాలపై హైకోర్టు సీరియస్

### గనుల శాఖకు ఫిర్యాదు బదిలీ.. విచారణకు సై




బాపట్ల జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా, సిలికా మైనింగ్ అనుమతుల దుర్వినియోగంపై జర్నలిస్ట్ నాయుడు నాగార్జున రెడ్డి చేసిన ఫిర్యాదుపై ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం స్పందించింది. ఆగస్టు 19, 2026న సమర్పించిన ఫిర్యాదును తదుపరి చర్యల కోసం గనులు, భూగర్భ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపింది. బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లో అక్రమ తవ్వకాలు, ఇసుక రవాణా, కేటాయింపు, వాన్‌పిక్ భూముల్లో అనధికార తవ్వకాలు, సిలికా మైనింగ్ అనుమతుల దుర్వినియోగంపై సమగ్ర తనిఖీలు, విచారణ చేపట్టాలని ఫిర్యాదులో కోరారు. పుల్లరిపాలెం- ఊటుకూరి సుబ్బయ్యపాలెం, వెదుళ్లపల్లి, తులసీనగరం-కావూరివారిపాలెం, ఈపురుపాలెం, గవినివారిపాలెం, సవరపాలెం, బోయినవారిపాలెం, కుందేరు ప్రాంతాల్లోనూ తనిఖీలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కొన్ని చోట్ల అధికారులు తనిఖీలు నిర్వహించి యంత్రాలు స్వాధీనం చేసుకోవడం, డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తవ్విన ఇసుక పరిమాణాన్ని శాస్త్రీయంగా లెక్కించి, సీసీ కెమెరా దృశ్యాలు, వాహనాలు, మైనింగ్ అనుమతులు, రెవెన్యూ రికార్డులు, రవాణా వివరాలను పరిశీలించాలని కోరారు. అక్రమాలకు పాల్పడిన వారిపై రాజకీయ పలుకుబడికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు.




## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సత్కారం

### విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో టీచర్లు కీలకం

ప్రొద్దుటూరు పట్టణంలోని గోల్డెన్ పార్క్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు--2026 పురస్కార ప్రధానోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హాజరై ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన గంగాధర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలకంగా పనిచేస్తారని తెలిపారు. ఉత్తమ సేవలను గుర్తించి అవార్డులతో సత్కరించడం ద్వారా ఉపాధ్యాయులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. విద్యారంగంలో నాణ్యమైన సేవలు అందించేందుకు ఇలాంటి గుర్తింపులు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శివప్రసాద్, ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, బీజేపీ జిల్లా కార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి, పలు పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.?

# రీల్స్ కోసం రియల్ శోభనం!

### ఒక్క రాత్రి.. ఒక్క సీన్..

### 18 గంటలు.. 11 కోట్ల వ్యూస్..!

మనం ఎక్కడున్నాం? ఏం చేస్తున్నాం? వైరల్ కావాలనే వెంపర్లాటలో విచక్షణను తాకట్టు పెడుతున్నామా? వ్యూస్ కోసం విలువలను కాలరాస్తున్నామా? రీల్ కోసం రియల్ జీవితాన్నే కెమెరా ముందు నగ్నంగా నిలబెడుతున్నామా? ఇది సోషల్ మీడియా కాలం. ఇక్కడ ప్రతిభకు ఒక విలువ ఉంటే.. సంచలనానికి పది రెట్లు విలువ ఉంటుంది. మంచి కంటెంట్‌కు ఓపికగా ఎదురుచూసే ప్రేక్షకుడు తగ్గిపోతున్నాడు. కళ్లను కట్టిపడేసే దృశ్యం కనిపిస్తే చాలు.. వేలితో స్క్రీన్‌ను తట్టి షేర్ చేసేస్తున్నాడు. ఆ ఒక్క టచ్ వెనుక ఉన్న మనిషి ఎవరు? అతని జీవితం ఏమిటి? అతని వ్యక్తిగత గౌరవం ఏమిటి? అన్న ప్రశ్నలు మాత్రం చాలా సార్లు అడగడం లేదు. ఒక యువతి రీల్స్ మాయలో పడింది. మొదట చిన్న చిన్న వీడియోలు చేసింది. డ్యాన్సులు చేసింది. ఫ్యాషన్ చూపించింది. అందాన్ని ప్రదర్శించింది. కెమెరా ముందు హావభావాలు పలికించింది. అయినా వ్యూస్ పెరగలేదు. ఫాలోవర్లు ఆశించిన స్థాయిలో రాలేదు. అప్పుడు కంటెంట్ కంటే తన శరీరమే పెద్ద కంటెంట్ అని భావించే ప్రమాదకరమైన మలుపు మొదలైంది. ఒంపులు.. సొంపులు.. చూపిస్తే వ్యూస్ వస్తాయని అనుకుంది. కానీ రాలేదు. అక్కడితో ఆగితే అది సాధారణ సోషల్ మీడియా కథే. కానీ వైరల్ కావాలనే పిచ్చి మనిషి ఆలోచనలపై పట్టు సాధించినప్పుడు హద్దులు ఎక్కడికి చేరుతాయో చెప్పడానికి ఈ కథ ఒక హెచ్చరిక.

**శోభనం గదిలో రీల్.. కోట్ల వ్యూస్ మాయ**

పెళ్లి కుదిరింది. పెళ్లి జరిగింది. కొత్త జీవితంలోకి అడుగుపెట్టింది. మరుసటి రోజు శోభనం. సాధారణంగా అది ఇద్దరు మనుషుల మధ్య ఉండాల్సిన అత్యంత వ్యక్తిగతమైన, ఆత్మీయమైన క్షణం. కానీ ఇక్కడ వ్యక్తిగత గది కాస్తా కంటెంట్ స్టూడియోగా మారింది. సెల్‌ఫోన్ సిద్ధమైంది. కెమెరా సిద్ధమైంది. జీవిత భాగస్వామి అభ్యంతరం చెప్పినా.. “ఇది ఒక్కసారి వైరల్ అయితే చాలు” అన్న మోజు ముందుకు నడిపింది. ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. శోభనం గదిలో ఉండాల్సిన ఆత్మీయత.. సెల్‌ఫోన్ స్క్రీన్ మీదకు వచ్చింది. రీల్ సోషల్ మీడియాలోకి వెళ్లింది. మొదట కొన్ని వేల వ్యూస్. తర్వాత లక్షలు. గంటలు గడిచేకొద్దీ సంఖ్య పెరిగింది. 18 గంటల్లో ఏకంగా 11 కోట్ల వ్యూస్ వచ్చాయని ఊహించండి. ఒక్కసారిగా ఆమె ఓవర్‌నైట్ స్టార్! నిన్నటి వరకు ఆమెను ఎవరూ గుర్తుపట్టలేదు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఆమె గురించి మాట్లాడుతున్నారు. ఫాలోవర్లు పెరిగారు. కామెంట్లు వెల్లువెత్తాయి. సోషల్ మీడియా ఆమెను




తాత్కాలికంగా సెలబ్రిటీని చేసింది..అదే రీల్ ప్రపంచం అసలు మాయ! నిన్ను పైకి ఎత్తేది కూడా అదే. కింద పడేసేది కూడా అదే. నిన్న నీ వీడియోకు కోట్ల వ్యూస్ తెచ్చిన ప్రేక్షకుడు రేపు మరో కొత్త సంచలనాన్ని వెతుక్కుంటాడు. నీ వ్యక్తిగత క్షణాన్ని ఆసక్తిగా చూసినవాడు మరుసటి రోజు నీపై నైతిక తీర్పు కూడా చెప్పొచ్చు. ఆ తర్వాత ఖాతా మూసుకుపోయింది.. అప్పుడు మిగిలేది ఏమిటి?ఒక వైరల్ రీల్. కొన్ని కోట్ల డిజిటల్ చూపులు. తాత్కాలి కంగా వచ్చిన గుర్తింపు. కానీ పోయిన ప్రైవసీ తిరిగి వస్తుందా? ఒకసారి ఇంటర్నెట్‌లోకి వెళ్లిన వ్యక్తిగత క్షణం నిజంగా పూర్తిగా చెరిగిపోతుందా? ఇదే అసలు ప్రశ్న.

మనమే రీల్స్‌ను నడుపుతాం. లేకపోతే ఒక రోజు.. కోట్ల వ్యూస్ మధ్యలో నిలబడి కూడా మనిషి తనను తాను వెతుక్కోవాల్సి వస్తుంది.

– హుస్సేన్

**కోట్ల వ్యూస్ కోసం విలువలు వేలం వేయొద్దు**

వ్యూస్ కోసం మనం ఎంత దూరం వెళ్లాలి? లైక్స్ కోసం మన జీవితంలో ఏ హద్దు దాటకూడదు? ఫాలోవర్ల కోసం మన గౌరవాన్ని బేరం పెట్టుకోవచ్చా? సోషల్ మీడియా శత్రువు కాదు. రీల్స్ కూడా నేరం కాదు. ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడానికి అవి అద్భుతమైన వేదికలు. సమస్య వేదికలో లేదు. వేదిక మీద మనం ఏమి పెడుతున్నామన్నదే సమస్య. ఒకప్పుడు ఇంటి గడప దాటని వ్యక్తిగత విషయాలు ఇప్పుడు ప్రపంచం ముందు ప్రత్యక్ష ప్రసారం అవుతున్నాయి. ఒకప్పుడు ఇద్దరి మధ్య ఉండాల్సిన సంభాషణలు ఇప్పుడు కామెంట్లకు ఆహారమవుతున్నాయి. ఒకప్పుడు జ్ఞాపకంగా మిగిలే క్షణాలు ఇప్పుడు వ్యూస్ కోసం కంటెంట్‌గా మారుతున్నాయి. ఇది కేవలం ఒక యువతి కథ కాదు. మన సమాజం ఎదుర్కొంటున్న కొత్త డిజిటల్ మానసికతకు అద్దం. వైరల్ కావడం తప్పు కాదు. కానీ ఎందుకు వైరల్ అవుతున్నామన్నది ముఖ్యం. ప్రతిభతో వైరల్ అయితే అది విజయం. ఆలోచనతో వైరల్ అయితే అది ప్రభావం. సమాజానికి ఉపయోగపడే సందేశంతో వైరల్ అయితే అది బాధ్యత. కానీ వ్యక్తిగత గౌరవాన్ని పణంగా పెట్టి వైరల్ అయితే? అది విజయం కాదు.. వ్యూస్ పేరుతో మన విలువలను మనమే వేలం వేయడం. రీల్‌కు రీప్లే ఉంటుంది. వ్యూస్‌కు కౌంట్ ఉంటుంది. లైక్స్‌కు సంఖ్య ఉంటుంది. కానీ జీవితానికి రీటేక్ ఉండదు. అందుకే కెమెరా ఆన్ చేసే ముందు ఒక్కసారి మనసును ఆన్ చేసుకోవాలి.“ఈ వీడియోకు ఎన్ని వ్యూస్ వస్తాయి?” అని అడగడం కంటే.. “ఈ వీడియో బయటికి వెళ్లిన తర్వాత నేను నన్ను నేను గౌరవించుకోగలనా?” అని అడిగే రోజు రావాలి. అప్పుడు మాత్రమే రీల్స్ మన జీవితాన్ని నడపవు.

## కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే మాలకొండయ్య

### సంపత్‌నగర్‌లో భక్తిశ్రద్ధలతో జన్మాష్టమి వేడుకలు



చీరాల పట్టణంలోని సంపత్‌నగర్ 3 రోడ్ల సెంటర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అక్కడి శ్రీకృష్ణ మందిరంలో నిర్వహించిన జన్మాష్టమి వేడుకలకు చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య నియోజకవర్గ ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. గోపాలకృష్ణుడి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి. జన్మాష్టమి సందర్భంగా ఆలయంలో భక్తి వాతావరణం నెలకొంది.

రాజ్య సంస్కరణ

శనివారం, 5.9.2026, మేడ్చల్ మల్కాజిగిరి



బెంగాల్‌లో దుర్గాపూజ ఇప్పుడు కేవలం భక్తి పండుగ కాదు.. రాజకీయ కథనాన్ని మార్చే బీజేపీ వ్యూహానికి కొత్త వేదికగా మారుతోందా? ఇదే ఇప్పుడు పెద్ద ప్రశ్న. దుర్గాపూజను బెంగాలీ అస్మితతో ముడిపెట్టి, దాని చుట్టూ ప్రజల భావోద్వేగాలను నిర్మించుకున్న మమతా బెనర్జీ రాజకీయానికి బీజేపీ మరో వైపు నుంచి సవాల్ విసురుతున్నట్లు కనిపిస్తోంది. ఇంతకాలం మమతా బెనర్జీ దుర్గాపూజను బెంగాల్ సంస్కృతి, కళ, ఆహారపు అలవాట్లు, సామాజిక వైవిధ్యానికి ప్రతీకగా చూపించారు. ఇప్పుడు బీజేపీ అదే పండుగను సనాతని హిందూ గుర్తింపు, సంప్రదాయం, ఆధ్యాత్మిక గర్వం చుట్టూ పునర్నిర్వచించాలనుకుంటోందన్న చర్చ మొదలైంది. వీహెచ్‌పీ సూచనలపై మొదలైన వివాదం కూడా ఈ రాజకీయ లెక్కలకే మరింత బలం ఇచ్చింది. థీమ్ పూజలు, ఆహారపు అలవాట్లు, పూజా సంప్రదాయాలు వంటి అంశాలపై ఎవరి నిర్వచనం సబబన్న ప్రశ్నను బీజేపీ ముందుకు తెస్తోంది. అసలు లక్ష్యం మమతా బెనర్జీకి ఉన్న 'బెంగాలీ సంస్కృతి కాపలాదారు' ఇమేజ్‌ను బలహీనపరచడమేనా? మమతా రాజకీయాల్లో దుర్గాపూజకు ఉన్న ప్రాధాన్యాన్ని తగ్గించి, అదే పండుగను హిందుత్వ కథనానికి కేంద్రంగా మార్చగలిగితే బెంగాల్‌లో రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపొచ్చన్నది బీజేపీ లెక్కగా కనిపిస్తోంది. అంటే ఇది పూజా పందిళ్ల పోరు మాత్రమే కాదు.. బెంగాల్ సంస్కృతికి అర్థం చెప్పే హక్కుపై జరుగుతున్న రాజకీయ పోరుగా మారుతోంది.

# బెంగాల్ ఆత్మకు అద్దం దుర్గాపూజ

## • సంస్కృతిపై కొత్త రాజకీయ పోరు? • పండుగపై మొదలైన కొత్త చర్చ
## • మమత బెనర్జీపై బీజేపీ మాస్టర్ స్ట్రోక్

### • దుర్గాపూజ.. సంస్కృతిపై బీజేపీ కొత్త కథనం?

బెంగాల్‌లో దుర్గాపూజ అంటే కేవలం దేవిని ఆరాధించే ఐదు రోజుల పండుగ కాదు. అది అక్కడి ప్రజల జీవనశైలిలో భాగం. భక్తి, కళ, ఆహారం, సామాజిక జీవితం, రాజకీయ చర్చలు, సృజనాత్మకత అన్నీ ఒకే వేదికపై కలిసే అతిపెద్ద సాంస్కృతిక సందర్భం. అందుకే దుర్గాపూజ చుట్టూ ఏ చిన్న మార్పు జరిగినా దాని ప్రభావం మతపరమైన పరిధిని దాటి సామాజిక, రాజకీయ రంగాలకు చేరుతుంది. ఈ ఏడాది పూజా ఉత్సవాలు సమీపిస్తున్న సమయంలో దుర్గాపూజను మరింత 'సనాతని' రూపంలోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందా? అనే చర్చ మొదలైంది. విశ్వ హిందూ పరిషత్ నుంచి వచ్చిన కొన్ని సూచనలపై మీడియా, సోషల్ మీడియా వర్గాల్లో వివాదం చెలరేగింది. పూజా పందిళ్లలో నాన్‌వెజ్ ఆహారాన్ని అనుమతించకూడదని, థీమ్ ఆధారిత పందిళ్ల విషయంలో పరిమితులు ఉండాలని సూచించినట్లు వార్తలు వచ్చాయి. అయితే వీహెచ్‌పీ తూర్పు ప్రాంత కార్యదర్శి అమియా సర్కార్ ఈ ప్రచారాన్ని ఖండించారు. థీమ్ పూజలకు తాము వ్యతిరేకం కాదని, నాన్‌వెజ్ ఆహారంపై నిషేధం కోరలేదని ఆయన స్పష్టం చేశారు. పూజా పందిళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, ఆహార దుకాణాల వ్యర్థాలతో పూజా ప్రాంగణాలు అపరిశుభ్రంగా మారకూడదన్నదే తమ అభిప్రాయమని తెలిపారు. అయితే ఇక్కడే మరో కీలక ప్రశ్న ముందుకొస్తోంది. 'భారతీయ సంస్కృతికి వ్యతిరేకం' అని నిర్ణయించేది ఎవరు? 'మత భావాలను దెబ్బతీసే అంశం' ఏదో నిర్ణయించే అధికారం ఎవరిది? ఈ ప్రశ్నలే ఇప్పుడు బెంగాల్ దుర్గాపూజ చర్చను సాధారణ పండుగ వివాదం నుంచి రాజకీయ, సాంస్కృతిక వాదనగా మార్చుతున్నాయి.

### • పందిళ్లు కాదు.. బెంగాల్ సాంస్కృతిక వేదిక

బెంగాల్ దుర్గాపూజ ప్రత్యేకత దాని వైవిధ్యంలో ఉంది. ప్రతి ఏడాది దేవి విగ్రహానికి కొత్త రూపం ఇవ్వడం, పందిళ్లను వినూత్న ఆలోచనలతో నిర్మించడం అక్కడి సంప్రదాయంగా మారింది. ఎక్కడో గిరిజన మహిళ రూపంలో దుర్గాదేవిని చూపిస్తారు. మరోచోట గ్రామీణ మహిళగా తీర్చిదిద్దుతారు. ఎక్కడో మట్టి, టెర్రకోట, వెదురు, కాగితం, అగ్గిపుల్లలు వంటి సాధారణ వస్తువులతో అద్భుతమైన విగ్రహాలు రూపొందిస్తారు. కొన్ని చోట్ల నాణేలు, నోట్లతో ప్రత్యేక అలంకరణలు కనిపిస్తాయి. ఇవి కేవలం భక్తి ప్రదర్శనలు కావు.. కళా సృజనకు, సామాజిక ఆలోచనకు, స్థానిక సంస్కృతికి ప్రతీకలు. పూజా కమిటీలు ఏడాది ముందుగానే తమ థీమ్‌లపై పని ప్రారంభిస్తాయి. ఒకప్పుడు స్థానిక సామాజిక సమస్యలు థీమ్‌లుగా ఉంటే, తర్వాత రాజకీయ పరిణామాలు, పర్యావరణ సమస్యలు, అంతర్జాతీయ సంఘటనలు కూడా పందిళ్లలో ప్రతిబింబించాయి. ఉక్రెయిన్ యుద్ధం వంటి అంతర్జాతీయ అంశాలు సైతం బెంగాల్ పూజా పందిళ్లలో కనిపించిన సందర్భాలున్నాయి. పందిళ్ల మధ్య పోటీ కూడా ఈ సంస్కృతిలో కీలక భాగంగా మారింది. ఉత్తమ పందిళ్లకు వివిధ సంస్థలు, ప్రభుత్వ విభాగాలు, ఇతర సంస్థలు అవార్డులు ప్రకటించడం వల్ల సృజనాత్మకత మరింత పెరిగింది. అందుకే థీమ్ పూజను కేవలం అలంకరణగా చూడటం బెంగాల్ దుర్గాపూజ స్వభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోకపోవడమే. పూజా పందిళ్లు అక్కడి సమాజం ఏం ఆలోచిస్తోందో చెప్పే బహిరంగ వేదికలుగా మారాయి. ప్రజల బాధలు, ఆశలు, రాజకీయ అసంతృప్తి, సామాజిక మార్పులు, ప్రపంచ పరిణామాలు అక్కడి కళాకారుల సృజనలో కనిపిస్తాయి. ఈ స్వేచ్ఛే బెంగాల్ పూజకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. కాబట్టి ఇప్పుడు 'ఏ థీమ్ సరైనది? ఏ థీమ్ తప్పు?' అనే ప్రశ్న తలెత్తడం వెనుక ఉన్న అసలు ఉద్దేశంపై సహజంగానే చర్చ మొదలవుతోంది.

### • మమతా మోడల్‌కు బీజేపీ భిన్న దారి

మమతా బెనర్జీ పాలనలో దుర్గాపూజకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక ప్రోత్సాహం లభించింది. దుర్గాపూజను కేవలం మతపరమైన కార్యక్రమంగా కాకుండా బెంగాల్ సాంస్కృతిక గుర్తింపుగా ప్రపంచానికి పరిచయం చేయాలి అన్నది ఆమె ప్రభుత్వ దృక్పథంగా కనిపించింది. యునెస్కో దుర్గాపూజను మానవాళి అమూర్త సాంస్కృతిక వారసత్వంగా గుర్తించిన తర్వాత ఈ అంశానికి మరింత ప్రాధాన్యం వచ్చింది. పూజా కమిటీలతో రాజకీయ నేతల అనుబంధం కూడా అప్పట్లో బలంగా కనిపించింది. మంత్రులు, తృణమూల్ కాంగ్రెస్ నేతలు పలు పూజా కమిటీల కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. అరూప్ బిశ్వాస్ పూజ, బాబీ హకీమ్ చేట్లలా పూజ, ఇంద్రనిల్ సేన్ పూజ వంటి కార్యక్రమాలు రాజకీయ పరిచయాలతో కూడిన ప్రముఖ ఉత్సవాలుగా నిలిచాయి. మమతా బెనర్జీ స్వయంగా చతుర్థి, పంచమి రోజులలో పలు పూజలను ప్రారంభించేవారు. జిల్లాల స్థాయిలో కూడా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేవారు. అయితే ఈ విధానాన్ని బీజేపీ నేతలు విమర్శించారు. ముఖ్యంగా బెంగాల్ ప్రస్తుత సీఎం, శువేందు అధికారి వీటిని ఖండించారు. ఇప్పుడు బీజేపీ నేతల వైఖరిలో మరో మార్పు కనిపిస్తోంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి స్వపన్ దాస్‌గుప్తా రాజకీయ నాయకులు పూజా కమిటీల నిర్వహణలో ప్రత్యక్షంగా భాగస్వాములు కాకపోవడమే మంచిదని అభిప్రాయపడ్డారు. తాను ఏ పూజా క్లబ్‌లోనూ నిర్వాహకుడిగా ఉండబోనని, సాధారణ భక్తుడిగా పూజను ఆస్వాదిస్తానని ఆయన ప్రకటించారు. ఇది కేవలం వ్యక్తిగత నిర్ణయమా? లేక మమతా ప్రభుత్వ కాలంలో ఏర్పడిన రాజకీయ-పూజా సంబంధానికి భిన్నమైన కొత్త నమూనాకు సంకేతమా? అనే చర్చ మొదలైంది. బీజేపీ ఇప్పుడు దుర్గాపూజను రాజకీయ నాయకుల కార్యక్రమంగా కాకుండా సనాతని సాంస్కృతిక గుర్తింపు వేదికగా మలచాలని చూస్తోందన్న అభిప్రాయం ఈ పరిణామాల మధ్య బలపడుతోంది.

### • సనాతని కథనంతో బెంగాల్‌ను మార్చే యత్నమా?

దుర్గాపూజలో ఆహార సంప్రదాయాల విషయానికి వస్తే బెంగాల్ చిత్రణ మరింత సంక్లిష్టంగా ఉంటుంది. అనేక ప్రాంతాల్లో చేపను భోగంగా సమర్పించే ఆచారం ఉంది. కొన్ని చోట్ల చేప తల వంటి ఆహార పదార్థాలను నైవేద్యంగా సమర్పించే సంప్రదాయాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఒకే రకమైన హిందూ ఆచారాలకు చెందినవి కావు. శాక్త, తాంత్రిక సంప్రదాయాలతో అనుసంధానమైన స్థానిక పద్ధతులు కూడా ఉన్నాయి. బేలూరు మఠంలోని దుర్గాపూజకు కూడా పూర్తిగా శాకాహార రూపమే ఉందని చెప్పలేం. ఈ వైవిధ్యాన్ని అర్థం చేసుకోకుండా ఒకే రకమైన 'సనాతని' ప్రమాణాన్ని అన్ని ప్రాంతాలకు వర్తింపజేయడం సాంస్కృతికంగా పెద్ద చర్చకు దారితీయవచ్చు. వీహెచ్‌పీ కూడా ఇలాంటి సంప్రదాయాల గురించి తమకు అవగాహన ఉందని చెబుతోంది. అయితే పూజా పందిళ్లలో తినే తిండిపై వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అంశం వెనుక మరింత విస్తృతమైన రాజకీయ కథనం కనిపిస్తోందన్నది విశ్లేషకుల అభిప్రాయం. శువేందు అధికారి ఆలయ సందర్శనలకు ప్రాధాన్యం ఇవ్వడం, తారాపీఠ్ నుంచి ఇతర పుణ్యక్షేత్రాల వరకు ధార్మిక కేంద్రాలను తన రాజకీయ సందేశంతో అనుసంధానం చేయడం, రాఖీ పండుగను హిందూ, వైష్ణవ సంప్రదాయాలతో కలపడం, పుస్తక ప్రదర్శనల్లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ వారసత్వాన్ని ముందుకు తేవడం వంటి చర్యలు ఈ దిశను సూచిస్తున్నాయి. రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ సంఘం వంటి సంస్థలను వివిధ కార్యక్రమాలతో అనుసంధానం చేయడం కూడా అదే సాంస్కృతిక దృక్పథంలో భాగంగా కనిపిస్తోంది. బీజేపీ ముందుకు తెస్తున్న ప్రధాన కథనం ఏమిటంటే.. భారతీయ సంప్రదాయాలకు గతంలో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని, పాశ్చాత్య ప్రభావంతో స్వదేశీ సాంస్కృతిక విలువలు వెనుకబడ్డాయని. ఇప్పుడు ఆ సంప్రదాయ గర్వాన్ని తిరిగి ప్రజల్లో బలపరచాలన్నది ఆ పార్టీ ఆలోచనగా కనిపిస్తోంది. తిలక్ జాతీయవాదం నుంచి రాజేంద్ర ప్రసాద్ కాలం నాటి హిందూ జాతీయ భావజాలం వరకు, సంప్రదాయ సంస్కృత విద్య నుంచి ఆధ్యాత్మిక జీవన విధానాల వరకు అనేక అంశాలను ఒక కొత్త సాంస్కృతిక కథనంగా కలిపే ప్రయత్నం జరుగుతోంది. బెంగాల్‌లో ఆ కథనానికి దుర్గాపూజను ఒక ప్రధాన వేదికగా ఉపయోగించాలన్న వ్యూహం ఉందా అన్నదే ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్న.

### • అసలు తీర్పు బెంగాల్ ప్రజలదే

ఇక్కడే ఈ మొత్తం పరిణామానికి అసలు పరీక్ష మొదలవుతుంది. బెంగాల్ ప్రజలు తమ దుర్గాపూజను ఎలా చూడాలనుకుంటున్నారు? భక్తి మాత్రమేనా? సనాతని గుర్తింపా? లేక శతాబ్దాలుగా రూపుదిద్దుకున్న కళ, ఆహారం, సామాజిక జీవితం, స్థానిక సంప్రదాయాలు, రాజకీయ ఆలోచనలు కలిసిన విస్తృత సంస్కృతా? ఈ ప్రశ్నకు సమాధానం రాజకీయ పార్టీలు నిర్ణయించలేవు. ప్రజలే నిర్ణయించాలి. దుర్గాపూజను ఒకే సిద్ధాంతానికి పరిమితం చేయడం ఎంతవరకు సాధ్యం అన్నది కాలమే చెబుతుంది. బెంగాల్ సంస్కృతి ఎప్పటి నుంచో అనేక ప్రవాహాల కలయిక. శాక్త సంప్రదాయం ఒక వైపు ఉంటే వైష్ణవ భావజాలం మరో వైపు ఉంది. గ్రామీణ ఆచారాలు, పట్టణ కళా సంస్కృతి, సాహిత్యం, సంగీతం, థియేటర్, రాజకీయ చైతన్యం అన్నీ దాని భాగాలే. అందుకే దుర్గాపూజను ఒకే రంగులో చిత్రించడం బెంగాల్ ప్రత్యేకతను తగ్గించే ప్రమాదం కలిగి ఉంది. అదే సమయంలో సంప్రదాయాల పరిరక్షణకు సంబంధించిన చర్చను పూర్తిగా తిరస్కరించడం కూడా సరైన దారి కాదు. పూజా పందిళ్లలో ఏ అంశాలు ఉండాలి? మత భావాలను దెబ్బతీసే హద్దు ఎక్కడ? ప్రజా ప్రదేశాల్లో ఆహార నిర్వహణ ఎలా ఉండాలి? పరిశుభ్రత ఎలా కాపాడాలి? సంప్రదాయాన్ని గౌరవిస్తూ ఆధునిక కళకు ఎంత స్వేచ్ఛ ఇవ్వాలి? ఇవన్నీ చర్చించాల్సిన అంశాలే. కానీ ఆ చర్చ రాజకీయ ఆధిపత్య పోరుగా మారినప్పుడు అసలు పండుగ వెనుకకు వెళ్లిపోతుంది. మమతా బెనర్జీ దుర్గాపూజను బెంగాలీ సాంస్కృతిక గుర్తింపుగా ప్రపంచానికి చూపించేందుకు ప్రయత్నించారు. బీజేపీ ఇప్పుడు దానికి సనాతని హిందూ గుర్తింపును మరింత బలంగా జోడించాలని చూస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ రెండు కథనాల మధ్య బెంగాల్ ప్రజల స్వంత సాంస్కృతిక స్వరం ఎక్కడ నిలుస్తుందన్నదే కీలకం. దుర్గాపూజ ఎవరి రాజకీయ ఆస్తి కాదు. అది బెంగాల్ ప్రజల సాంస్కృతిక వారసత్వం. అందుకే ఈసారి పందిళ్లలో దేవి విగ్రహం ఎలా ఉంటుందన్నదానికంటే, బెంగాల్ సమాజం తన సంస్కృతిని ఎలా నిర్వచించుకుంటుందన్నదే పెద్ద ప్రశ్నగా మారింది. బీజేపీ సనాతని కథనం ఎంతవరకు ప్రజల్లో స్థిరపడుతుంది? మమతా బెనర్జీ చెప్పే బెంగాలీ అస్మితకు ఎంత బలం ఉంటుంది? లేక బెంగాల్ తన ప్రత్యేకమైన మిశ్రమ సంస్కృతినే కొనసాగిస్తుందా? ఈ ప్రశ్నలకు సమాధానం ఎన్నికల ప్రచారాల్లో కాదు.. దుర్గాపూజ పందిళ్ల మధ్య, బెంగాల్ వీధుల్లో, ప్రజల మనసుల్లోనే వెలువడుతుంది.

### • దుర్గాపూజ చుట్టూ బెంగాల్‌లో కొత్త రాజకీయ పోరు

అయితే ఈ వ్యూహం ఎటువైపు దారితీస్తుందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. దుర్గాపూజను సనాతని హిందూ గుర్తింపుతో ముడిపెట్టి బీజేపీ మమతా బెనర్జీ రాజకీయానికి ప్రత్యామ్నాయ సాంస్కృతిక కథనాన్ని నిర్మించగలిగితే.. బెంగాల్ రాజకీయాల్లో అది కీలక మలుపు కావచ్చు. మమతా ఇంతకాలం 'బెంగాలీ అస్మిత'ను తన రాజకీయ బలంగా ఉపయోగించుకున్నారు. బీజేపీ ఇప్పుడు అదే అస్మితలో హిందూ సనాతన భావజాలాన్ని మరింత బలంగా చొప్పించాలని చూస్తోంది. ఈ ప్రయత్నం ఫలిస్తే మమతా ఆధిపత్యంలోని సాంస్కృతిక రాజకీయానికి గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉంది. అయితే బెంగాల్ ప్రజలు తమ పండుగను కేవలం రాజకీయ రంగంలోనే చూడరన్నది కూడా అంతే నిజం. చేప నుంచి థీమ్ పూజల వరకు, కళ నుంచి సామాజిక సందేశాల వరకు అక్కడి దుర్గాపూజకు ప్రత్యేకమైన బహుళత్వం ఉంది. దానిని ఒకే సిద్ధాంతానికి కట్టిపడేయాలన్న ప్రయత్నం ప్రజల్లో ఎంతవరకు ఆదరణ పొందుతుందో చెప్పలేం. బీజేపీకి ఇది మమతాను ఎదుర్కొనే కొత్త ఆయుధం కావచ్చు.. కానీ బెంగాల్ ప్రజలకు మాత్రం తమ సంస్కృతిపై తుది మాట చెప్పే హక్కు ఎవరికివ్వాలన్నదే అసలు నిర్ణయం. ఈసారి పందిళ్లలో దేవి దర్శనం కంటే.. బెంగాల్ రాజకీయ భవిష్యత్తు ఏ రంగులో కనిపిస్తుందన్నదే ఆసక్తికరంగా మారింది.

### • ఆహారపు అలవాట్ల నుంచి రాజకీయ పోరు

దుర్గాపూజ చుట్టూ ఆహారపు అలవాట్లు కూడా బెంగాల్ రాజకీయాల్లో సున్నితమైన అంశంగా మారాయి. చేప బెంగాలీ సంస్కృతిలో ఎంత బలంగా ముడిపడి ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చేపతో పాటు ఇతర నాన్‌వెజ్ ఆహారాలు కూడా అక్కడి కుటుంబ జీవనంలో సాధారణమైనవే. గతంలోనే ఈ అంశం రాజకీయ ప్రచారంలోకి వచ్చింది. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాలీల ఆహారపు అలవాట్లలో జోక్యం చేసుకునే అవకాశం ఉందని విమర్శించారు. ముఖ్యంగా చేప తినే బెంగాలీ సంస్కృతిని ప్రస్తావిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఎన్నికల సమయంలో పెద్ద రాజకీయ చర్చకు దారితీశాయి. దీనికి సమాధానంగా పలువురు బీజేపీ నేతలు బహిరంగంగా చేపలు తింటూ తమపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. కొందరు నేతలు చేపల బుట్టలతో ప్రచార కార్యక్రమాల్లో కనిపించారు. 'బీజేపీ బెంగాలీ ఆహార సంస్కృతికి వ్యతిరేకం కాదు' అనే సందేశాన్ని ప్రజలకు ఇవ్వడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో ఇది రాజకీయ వ్యూహంగా కనిపించింది. ఇప్పుడు దుర్గాపూజ నేపథ్యంలో వీహెచ్‌పీ చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన సూచనలు మళ్లీ అదే ప్రశ్నను తెరపైకి తెచ్చాయి. అయితే నాన్‌వెజ్ ఆహారాన్ని నిషేధించాలన్న చర్చ తమ సమావేశంలో జరగలేదని విశ్వ హిందూ పరిషద్ స్పష్టం చేస్తోంది. పూజా పందిళ్లలో ఆహారం విషయంలో ప్రధానంగా పరిశుభ్రతపైనే దృష్టి పెట్టామని వారు చెబుతున్నారు. అయినప్పటికీ బెంగాల్ ప్రజల ఆహారపు అలవాట్లు రాజకీయ గుర్తింపుతో ముడిపడిన సందర్భంలో ఈ వివాదం సహజంగానే రాజకీయ రంగు పులుముకుంటోంది. బెంగాలీ గుర్తింపును మతపరమైన గుర్తింపుతో ఎంతవరకు కలపాలి? స్థానిక సంప్రదాయాలకు ఎంత స్థలం ఉండాలి? సనాతని విలువలను ముందుకు తీసుకురావడంలో ప్రాంతీయ సంస్కృతికి ఏ స్థానం ఉండాలి? ఇవే ఇప్పుడు పెద్ద ప్రశ్నలుగా మారుతున్నాయి.







తెలంగాణ రాజకీయాలు మరో కీలక మలుపు వద్దకు చేరుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో మూడేళ్ల పాలన పూర్తి చేసుకోబోతోంది. అధికారంలోకి వచ్చినప్పుడు ఉన్న రాజకీయ ఉత్సాహం ఇప్పుడు అదే స్థాయిలో ఉందా? కాంగ్రెస్ తన పట్టును మరింత బలోపేతం చేసుకుంటోందా? లేక అధికార వ్యతిరేకత క్రమంగా పెరుగుతోందా? మరోవైపు పదేళ్ల పాలన తర్వాత ప్రతిపక్షంలోకి వెళ్లిన బీఆర్ఎస్ మళ్లీ ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. బీజేపీ కూడా తెలంగాణలో తన స్థాయిని పెంచుకునేందుకు కొత్త రాజకీయ లెక్కలు వేస్తోంది. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో మూడు పార్టీల మధ్య పోరు క్రమంగా మరింత ఆసక్తికరంగా మారుతోంది. ఒకవైపు కాంగ్రెస్ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చూస్తుంటే.. మరోవైపు బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ మాత్రం రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా తన బలాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అసెంబ్లీ ఎన్నికల విజయం అప్పట్లో అనూహ్య రాజకీయ పరిణామంగా నిలిచింది. బీఆర్ఎస్ పదేళ్ల అధికారాన్ని కోల్పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టింది. అయితే మూడేళ్ల పాలన పూర్తయ్యే దశలో ఇప్పుడు అసలు పరీక్ష మొదలవుతోంది. ప్రభుత్వం అమలు చేసిన హామీలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు ప్రజల్లో ఎంతవరకు ప్రభావం చూపాయన్నది ఒక ప్రశ్నగా మారింది. అదే సమయంలో 'వెయ్యి రోజుల పండుగ' అనే అధికార పక్ష ప్రచారానికి ఎదురుగా 'వెయ్యి రోజుల విధ్వంసం' అనే ప్రతిపక్ష విమర్శలు వినిపించే పరిస్థితి కనిపిస్తోంది. ఈ రెండు నేరేషన్ల మధ్యే రాబోయే రాజకీయ పోరు సాగనుంది. కాంగ్రెస్‌కు ఇప్పటివరకు ఉన్న అధికార బలం ఒక అంశమైతే.. పార్టీ అంతర్గత విభేదాలు మరో పెద్ద సవాలుగా మారుతున్నాయి. మంత్రుల మధ్య సమన్వయం, ఎమ్మెల్యేల అసంతృప్తి, పదవుల కోసం పోటీ, హైకమాండ్ నిర్ణయాలపై ఎదురుచూపులు అన్నీ కలిసి కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలకు దారి తీస్తున్నాయి.

# తెలంగాణ రాజకీయాల్లో అసలేం జరుగుతోంది?

## వెయ్యి రోజుల ముంగిట.. మూడు పార్టీల మూడో లెక్క!











### • పీసీసీ చీఫ్‌గా పొన్నం ప్రభాకర్ ఖరారు..!?

కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖను పదవి నుంచి తొలగించిన పరిణామం పార్టీ అంతర్గత రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ఒక్క మంత్రి పదవి ఖాళీ కావడంతో విషయం అక్కడితో ఆగిపోలేదు. ఇంకా ఎవరిపై వేటు పడబోతోంది? మంత్రివర్గంలో మరిన్ని మార్పులు ఉంటాయా? లేక పూర్తిస్థాయి పునర్వ్యవస్థీకరణ జరుగుతుందా? అనే ప్రశ్నలు కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. కొందరు నేతలపై అధిష్ఠానం అసంతృప్తిగా ఉందన్న ప్రచారం ఇప్పటికే రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మరికొందరు నేతలకు భరోసా లభించిందన్న మాటలు కూడా వినిపిస్తున్నాయి. అయితే తుది నిర్ణయం మాత్రం అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణలో సీనియార్టీ, ప్రాంతీయ సమతుల్యత, సామాజిక సమీకరణాలు, మహిళా ప్రాతినిధ్యం కీలక అంశాలుగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం పలువురు నేతల పేర్లు మంత్రి పదవుల రేసులో వినిపిస్తున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, ఆది శ్రీనివాస్, బాలు నాయక్, రాంచందర్ నాయక్, గడ్డం ప్రసాద్‌కుమార్, మల్‌రెడ్డి రంగారెడ్డి వంటి పేర్లు చర్చలో ఉన్నాయి. ప్రతి నేతకు తనకంటూ రాజకీయ బలం ఉంది. ఎవరి ప్రాంతీయ ప్రాతినిధ్యం ఏమిటి? ఎవరి సామాజిక వర్గానికి ఇప్పటికే ఎంత ప్రాతినిధ్యం ఉంది? ఎవరు పార్టీ కోసం ఎంతకాలంగా పనిచేస్తున్నారు? ఎన్నికల సమయంలో ఎవరి పాత్ర ఎంత? వంటి అంశాలను అధిష్ఠానం పరిశీలించే అవకాశం ఉంది. అదే సమయంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మంత్రివర్గంలో అవకాశం వస్తుందా? అనే ప్రశ్న కూడా ఆసక్తిని పెంచుతోంది. ఆయన మంత్రిగా వస్తే పీసీసీ అధ్యక్ష పదవికి కొత్త వ్యక్తి అవసరం అవుతుంది. ఆ స్థానంలో పొన్నం ప్రభాకర్ పేరు వినిపిస్తోంది. పొన్నం పీసీసీ చీఫ్‌గా వస్తే పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో మార్పులు వస్తాయా? జిల్లాల వారీగా పార్టీని మరింత యాక్టివ్ చేస్తారా? అసంతృప్త నేతలను కలుపుకొని వెళ్లగలరా? అన్నది చూడాలి. మూడు పదవుల చుట్టూ పెద్ద సంఖ్యలో ఆశావహులు ఉండటం కాంగ్రెస్‌లో అంతర్గత పోటీని మరింత పెంచుతోంది. ఒకరికి పదవి వస్తే మరొకరికి నిరాశ తప్పదు. అదే అసంతృప్తి భవిష్యత్తులో పార్టీకి సమస్యగా మారే అవకాశం ఉంది.

### • రేవంత్‌కు అసలు పరీక్ష ఇదే

కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్పులు జరిగితే దాని ప్రభావం కేవలం మంత్రివర్గానికే పరిమితం కాకపోవచ్చు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంపై కూడా దాని ప్రభావం ఉంటుంది. ఇప్పటివరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్నా.. రేవంత్‌రెడ్డి మాత్రం తన నాయకత్వంలోనే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని చెబుతున్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికలే ఆయన రాజకీయ నాయకత్వానికి అసలు పరీక్షగా మారనున్నాయి. ప్రస్తుతం ఆయన ముందు రెండు అంశాలున్నాయి. ఒకటి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకాన్ని కొనసాగించడం. రెండోది పార్టీని అంతర్గతంగా ఒకే తాటిపై నడిపించడం. ప్రభుత్వం బయట బీఆర్ఎస్, బీజేపీతో పోరాడుతుంటే.. పార్టీ లోపల అసంతృప్తి, పదవుల పోటీ, వర్గ రాజకీయాలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకవైపు మంత్రివర్గంలో మార్పులు చేసి సమతుల్యత సాధించాలని ప్రయత్నిస్తే.. మరోవైపు మార్పులతో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. అందుకే ప్రతి నిర్ణయం రాజకీయంగా జాగ్రత్తగా తీసుకోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్‌లో నేతల మధ్య విభేదాలు బహిరంగమైతే ప్రతిపక్షాలకు అది బలమైన ఆయుధంగా మారుతుంది. ముఖ్యంగా బీఆర్ఎస్ ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తోంది. ప్రభుత్వ హామీలు, రైతు సమస్యలు, నిరుద్యోగం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి అంశాలను బీఆర్ఎస్ తన ప్రచారంలో ప్రధానంగా ఉపయోగించుకునే అవకాశం ఉంది. కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ పదేళ్ల పాలనను ప్రజలకు గుర్తుచేస్తూ గత ప్రభుత్వ వైఫల్యాలను తన రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకుంటోంది. దీంతో తెలంగాణ రాజకీయాల్లో 'గత పాలన వర్సెస్ ప్రస్తుత పాలన' అనే పోటీ మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. రేవంత్‌రెడ్డి వ్యక్తిగత నాయకత్వం కూడా ఇందులో కీలకం కానుంది. ఆయన పార్టీ నేతలను ఎంతవరకు సమన్వయం చేస్తారు? సీనియర్ నేతలకు ఎంత ప్రాధాన్యం ఇస్తారు? అసంతృప్త వర్గాలను ఎలా బుజ్జగిస్తారు? మంత్రివర్గ మార్పుల తర్వాత పార్టీ సమీకరణాలను ఎలా కాపాడుకుంటారు? అన్నది రాబోయే కాలంలో కాంగ్రెస్ భవిష్యత్తును ప్రభావితం చేయగల అంశాలుగా మారనున్నాయి.

### • వెయ్యి రోజులు విధ్వంసమంటూ బీఆర్ఎస్ దూకుడు

అధికార కాంగ్రెస్‌కు ప్రధాన రాజకీయ సవాలు బీఆర్ఎస్ నుంచే వస్తోంది. ఓటమి తర్వాత కొంతకాలం రాజకీయంగా వెనుకబడినట్టుగా కనిపించిన బీఆర్ఎస్ ఇప్పుడు మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతోంది. కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరూ తమ తమ రాజకీయ శైలిలో ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ పార్టీ క్యాడర్‌ను యాక్టివ్ చేస్తున్నారు. కేటీఆర్ పట్టణ ప్రాంతాలు, యువత, ఉద్యోగులు, పరిశ్రమలు, ప్రభుత్వ విధానాలపై దృష్టి పెడుతుంటే.. హరీశ్‌రావు గ్రామీణ ప్రాంతాలు, రైతులు, సాగునీరు, సంక్షేమ అంశాలను ప్రధానంగా తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇద్దరు నేతలు.. బీఆర్ఎస్ క్యాడర్‌లో ఉత్సాహాన్ని పెంచుతున్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన విధ్వంసం అంటూ.. బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. ఐతే, కేసీఆర్ ఎప్పుడు పూర్తి స్థాయిలో ప్రజల్లోకి వస్తారు? కేసీఆర్ ప్రత్యక్షంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పార్టీకి నాయకత్వం వహిస్తే బీఆర్ఎస్ రాజకీయ వేగం మరింత పెరగవచ్చు. కేసీఆర్ ఇప్పటికీ బీఆర్ఎస్‌కు ప్రధాన రాజకీయ ముఖచిత్రం. ఆయన ప్రజల్లోకి రావడం పార్టీకి మానసిక బలం ఇవ్వగలదు. అయితే గత ఎన్నికల్లో ఎదురైన పరాజయానికి కారణాలను పార్టీ ఎంతవరకు విశ్లేషించింది? ప్రజల్లో మారిన అభిప్రాయాలను ఎలా అర్థం చేసుకుంది? కొత్త తరానికి పార్టీని ఎలా దగ్గర చేస్తుంది? అన్నవి బీఆర్ఎస్ ముందున్న సవాళ్లు. కేటీఆర్, హరీశ్‌రావు దూకుడు మాత్రమే సరిపోదు. పార్టీ సంస్థాగతంగా బలపడటం, స్థానిక స్థాయిలో క్యాడర్‌ను తిరిగి చైతన్యపరచడం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయడం అవసరం. కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరిగితే దాన్ని ఓటుగా మార్చుకునే స్థాయిలో బీఆర్ఎస్ సిద్ధంగా ఉండాలి. అయితే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్న ప్రతి ఓటు బీఆర్ఎస్‌కే వస్తుందని భావించడం కూడా ప్రమాదమే. మరోవైపు కేసీఆర్ కుమార్తె కవిత రాజకీయ ప్రయోగాలు కూడా ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారే ప్రమాదం లేకపోలేదు.

### • బీజేపీకి కొత్త వ్యూహం అవసరం

తెలంగాణలో బీజేపీ కూడా తన రాజకీయ స్థాయిని పెంచుకునే ప్రయత్నంలో ఉంది. కేంద్రంలో కీలక మార్పులు జరిగితే వాటి ప్రభావం తెలంగాణ బీజేపీపై పడే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. బండి సంజయ్ మళ్లీ రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపడతారా? కిషన్‌రెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో మరింత యాక్టివ్ అవుతారా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. వీళ్లద్దరూ కాకుండా మరో నాయకుడు పగ్గాలు చేపడతారా అన్న చర్చ కూడా పార్టీలో ఉంది. ఢిల్లీ పెద్దలు సైతం మొత్తం వ్యవహారంపై తర్జనభర్జనకు గురౌతున్నారని చెబుతున్నారు. బీజేపీకి ప్రస్తుతం ఉన్న ప్రధాన బలం కేంద్ర నాయకత్వం, సంస్థాగత నిర్మాణం, కొన్ని ప్రాంతాల్లో ఉన్న బలమైన ఓటు బ్యాంక్ కీలకం కానుంది. అయితే కాంగ్రెస్ అధికారంలో ఉండటం, బీఆర్ఎస్ తిరిగి బలపడేందుకు ప్రయత్నించడం మధ్య బీజేపీ తన స్థానం ఎక్కడ నిర్మించుకుంటుందన్నది కీలకం. బండి సంజయ్ తిరిగి రాష్ట్ర అధ్యక్షుడిగా వస్తే పార్టీకి పోరాట శైలి మరింత దూకుడుగా మారే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి. కిషన్‌రెడ్డి వంటి సీనియర్ నేత రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర తీసుకుంటే మరో రకమైన సమీకరణం ఏర్పడవచ్చు. ఇక దూకుడుగా ఉన్న కొందరు నేతలు సైతం తాము సైతం పార్టీని లీడ్ చేస్తామంటున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై బీజేపీ దాడిని మరింత పెంచుతుందా? బీఆర్ఎస్‌ను కూడా సమానంగా టార్గెట్ చేస్తుందా? లేక కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్న ఓటును తనవైపు తిప్పుకునే వ్యూహాన్ని అనుసరిస్తుందా? అన్నది చూడాలి. తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదగాలంటే బీజేపీకి కేవలం కేంద్ర నాయకత్వం ప్రభావం సరిపోదు. బలమైన రాష్ట్ర నాయకత్వం, నిరంతర గ్రౌండ్ కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై స్పష్టమైన వైఖరి అవసరం. అదే సమయంలో బీజేపీ అంతర్గత సమీకరణాలు కూడా కీలకం. అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుంది? ఎవరికి కీలక బాధ్యతలు వస్తాయి? సీనియర్ నేతలు, యువ నాయకత్వం మధ్య సమన్వయం ఎలా ఉంటుంది? అన్నది పార్టీ భవిష్యత్తును నిర్ణయించవచ్చు. కాంగ్రెస్‌లో అసంతృప్తి పెరిగితే ఆ రాజకీయ ఖాళీని బీజేపీ ఉపయోగించుకునే ప్రయత్నం చేయవచ్చు. బీఆర్ఎస్‌లో బలహీనత కనిపిస్తే అక్కడి నుంచి కూడా రాజకీయ ప్రయోజనం పొందాలని చూడవచ్చు. అందుకే తెలంగాణలో రాబోయే కాలం మూడు పార్టీల మధ్య తీవ్రమైన రాజకీయ పోటీకి వేదికగా మారే అవకాశం ఉంది.

## • ముందున్న రెండేళ్లు.. ఎవరి వ్యూహం గెలుస్తుంది?

మొత్తంగా చూస్తే తెలంగాణలో ఇప్పటి రాజకీయ పోరు కేవలం అధికార కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గా లేదు. కాంగ్రెస్‌లో అంతర్గత సమీకరణాలు, బీఆర్ఎస్ పునరుజ్జీవన ప్రయత్నాలు, బీజేపీ కొత్త వ్యూహం.. ఈ మూడు అంశాలు కలిసే రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. కాంగ్రెస్‌కు ప్రస్తుతం అధికార బలం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం ఉంది. హామీల అమలు ద్వారా ప్రజల్లో మద్దతు నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉంది. అదే సమయంలో పార్టీ అంతర్గత విభేదాలను అదుపులో పెట్టుకోవాలి. మంత్రి పదవుల కోసం పోటీ, పీసీసీ అధ్యక్ష పదవి మార్పు, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలు పార్టీకి అవకాశాలుగా కూడా మారవచ్చు. సరైన సమతుల్యత సాధిస్తే కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకోవచ్చు. తప్పు నిర్ణయాలు తీసుకుంటే అవే విభేదాలకు కారణమయ్యే ప్రమాదం ఉంది. బీఆర్ఎస్‌కు ఇప్పుడు తిరిగి ప్రజల్లో బలాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. కేటీఆర్, హరీశ్‌రావు ఇప్పటికే చేస్తున్న కార్యక్రమాలకు కేసీఆర్ పూర్తి స్థాయి రాజకీయ చురుకుదనం తోడైతే ఆ పార్టీ పోరాటం మరింత బలపడవచ్చు. అయితే గత పాలనపై ఉన్న ప్రజా అభిప్రాయాన్ని మార్చడం బీఆర్ఎస్‌కు పెద్ద సవాలే. బీజేపీ విషయానికి వస్తే.. పార్టీ రాష్ట్ర నాయకత్వ మార్పు ఏదైనా జరిగితే దాని ప్రభావం వచ్చే ఎన్నికల వ్యూహంపై పడవచ్చు. బండి సంజయ్ దూకుడు, కిషన్‌రెడ్డి సీనియార్టీ, కేంద్ర నాయకత్వం బలం.. వీటిని ఒకే రాజకీయ వ్యూహంగా మార్చగలిగితే బీజేపీ తన ఓటు శాతాన్ని పెంచుకునే అవకాశం ఉంటుంది. చివరికి తెలంగాణ రాజకీయాల్లో ఎవరు గెలుస్తారన్నది ఇప్పుడే చెప్పడం కష్టం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. వచ్చే రెండేళ్లు మూడు పార్టీలూ.. మేమే గెలుస్తామన్న దీమాలో ఉన్నాయి. కాంగ్రెస్ తన పాలనను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తుందో.. బీఆర్ఎస్ తన పాత బలాన్ని ఎంతవరకు తిరిగి తెచ్చుకుంటుందో.. బీజేపీ తన ప్రత్యామ్నాయ రాజకీయాన్ని ఎంత బలంగా నిర్మించుకుంటుందో అన్నదే అసలు కథ. కాంగ్రెస్‌లో అసంతృప్తి ఎంత పెరుగుతుంది? బీఆర్ఎస్ ఎంత వేగంగా తిరిగి నిలబడుతుంది? బీజేపీ ఎవరిని ముందుకు తెస్తుంది? రేవంత్‌రెడ్డి తన పార్టీని ఏకతాటిపై ఎంతవరకు నడిపిస్తారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రాజకీయ పరిణామాల్లో ఒక్కొక్కటిగా బయటపడనున్నాయి. తెలంగాణలో అసలు ఆట ఇప్పుడే మొదలైందన్నది మాత్రం రాజకీయ పరిశీలకుల అంచనా.






# వస్తున్నా..గర్జనై
# మీకోసం..ప్రాణమై
## జగన్ 2.0 పాదయాత్రకు ముహూర్తం ఫిక్స్

**రాజకీయాల్లో కొన్ని అడుగులు సాధారణ అడుగులు కావు. అవి ఒక నాయకుడి రాజకీయ భవిష్యత్తుకు దిశను మార్చే అడుగులు. కొన్ని అడుగులు పార్టీకి ఊపిరి పోస్తాయి. మరికొన్ని అడుగులు ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టిస్తాయి. ఇంకొన్ని అడుగులు ప్రజల మనసుల్లో పాత జ్ఞాపకాలను కదిలిస్తాయి. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ జీవితంలో అలాంటి అడుగు ఒకటి ఇప్పటికే చరిత్ర సృష్టించింది. ఇప్పుడు మరోసారి అదే అడుగు పడబోతోందన్న ప్రచారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపుతోంది. పాదయాత్ర చేస్తాను అని జగన్ కొంతకాలంగా చెబుతున్నారు. పార్టీ నేతలు కూడా అదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారు. ఏడాది కూడా దాదాపు ఖరారైనట్టే కనిపిస్తోంది. 2027. కానీ అసలు ట్విస్ట్ మాత్రం ఇప్పుడు బయటకు వచ్చింది. నెల ... తేదీ కూడా బయటకు వచ్చిందన్న ప్రచారం మొదలైంది. ఆ తేదీ 2027 జూలై 8. జూలై 8 అంటే వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి. తండ్రి జయంతి రోజునే తన రాజకీయ పునఃప్రయాణానికి శ్రీకారం చుట్టాలని జగన్ ఆలోచిస్తున్నారన్న వార్త ఇప్పుడు వైసీపీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సోషల్ మీడియాలో ఈ వార్త వేగంగా చక్కర్లు కొడుతోంది. పార్టీ వర్గాల పేరుతో ఈ తేదీ ప్రచారంలోకి రావడం, జాతీయ మీడియా సంస్థ ఇండో-ఏషియన్ న్యూస్ సర్వీస్ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు వార్తలు రావడంతో చర్చ మరింత పెరిగింది. అంటే ముహూర్తం ఖరారైందా? జగన్ మళ్లీ ప్రజల మధ్యకు వెళ్లేందుకు మానసికంగా సిద్ధమయ్యారా? 2029 ఎన్నికలే లక్ష్యంగా ఈ యాత్రకు వ్యూహం సిద్ధమైందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఇక్కడే రాజకీయాల్లోని అసలు మెలికను గుర్తించాలి. ప్రచారంలోకి వచ్చిన తేదీ ఒకటి. పార్టీ అధికారికంగా ప్రకటించే తేదీ మరొకటి. ఈ రెండింటి మధ్య చాలా తేడా ఉంటుంది. కాబట్టి వైసీపీ అధికారిక ప్రకటన చేసే వరకూ జూలై 8 ఖరారైన తేదీగా చెప్పలేం. కానీ రాజకీయాల్లో కొన్ని వార్తలు అధికారిక ప్రకటన కంటే ముందే తమ ప్రభావాన్ని చూపిస్తాయి. ఈ తేదీ చుట్టూ మొదలైన చర్చ కూడా అలాంటిదే. ముఖ్యంగా వైసీపీ శ్రేణుల్లో మాత్రం ఈ వార్త కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. జగన్ వస్తారు. మళ్లీ వస్తారు. ఈసారి సభలతో కాదు. రోడ్ల మీదుగా వస్తారు. మళ్లీ ప్రజల మధ్య నడుస్తారు. మళ్లీ పల్లెలను పలకరిస్తారు. మళ్లీ గడపగడపకూ వెళ్తారు. మళ్లీ ప్రజల సమస్యలు వింటారు. మళ్లీ కార్యకర్తల భుజంపై చేయి వేస్తారు. మళ్లీ పార్టీకి ఒక కొత్త ఊపును తీసుకొస్తారు. ఇదే ఇప్పుడు వైసీపీ శ్రేణుల్లో వినిపిస్తున్న ఆశ.**

### పది సంవత్సరాల క్రితం మొదలైన కథకు మరో అధ్యాయం

2017 నవంబర్ 6. ఆ రోజు జగన్ తన రాజకీయ జీవితంలో ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రజా సంకల్ప యాత్ర పేరుతో సుదీర్ఘ పాదయాత్ర ప్రారంభించారు. అప్పటికి వైసీపీ ప్రతిపక్షంలో ఉంది. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. అధికారంలోకి రావాలన్న లక్ష్యం ఉంది. కానీ ఆ లక్ష్యానికి ప్రజలతో మరింత దగ్గరవ్వాల్సిన అవసరం ఉందని ఆయన భావించారు. అందుకే రోడ్డు మీదకు వచ్చారు. ఆ యాత్ర సాధారణ పాదయాత్రగా మిగలలేదు. జగన్ రాజకీయ జీవితానికి ఒక కొత్త అధ్యాయాన్ని తెరిచింది. గ్రామాల మీదుగా సాగిన అడుగులు, ప్రజలతో జరిగిన ముఖాముఖి, సమస్యలపై వినిపించిన స్పందనలు, కార్యకర్తల్లో వచ్చిన ఉత్సాహం... ఇవన్నీ కలిసి వైసీపీకి ఒక రాజకీయ ఊపు ఇచ్చాయి. చివరికి 2019 ఎన్నికల్లో ఆ పార్టీ అధికారాన్ని సాధించింది. జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. ఇప్పుడు దాదాపు పదేళ్లకు చేరువలో మరోసారి పాదయాత్ర మాట వినిపిస్తోంది. అప్పట్లో అధికారాన్ని సాధించడానికి చేసిన యాత్ర. ఇప్పుడు కోల్పోయిన అధికారాన్ని తిరిగి సాధించడానికి చేసే యాత్ర. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న నాయకుడు అధికారాన్ని లక్ష్యంగా చేసుకుని నడిచారు. ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రిగా ప్రతిపక్ష రాజకీయాన్ని మళ్లీ బలోపేతం చేసుకోవడానికి నడవబోతున్నారని ప్రచారం. ఈ రెండు సందర్భాల మధ్య ఒక పెద్ద రాజకీయ తేడా ఉంది. అదే ఈ యాత్రను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది.

### ఒక తేదీ... ఒక రాజకీయ సందేశం.. పోయిన చోటనే వెతుక్కోవాలి!

2027 జూలై 8 అనే తేదీ నిజంగా ఖరారైతే, అది ఒక రాజకీయ సందేశాన్ని కూడా ఇస్తుంది. 2029 ఎన్నికలకు రెండేళ్ల ముందే జగన్ తన పూర్తి స్థాయి ప్రజా యాత్రను ప్రారంభించినట్టవుతుంది. అంటే ఎన్నికలకు ముందు పార్టీని క్షేత్రస్థాయిలో పునర్నిర్మించుకోవడానికి ఆయనకు సమయం ఉంటుంది. ఒక పాదయాత్ర అంటే కేవలం నాయకుడు నడవడం కాదు. అది ఒక భారీ రాజకీయ యంత్రాంగాన్ని కదిలించడం. ప్రతి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు అందులో భాగస్వాములవుతారు. పాదయాత్ర సాగుతున్నంతకాలం పార్టీకి నిరంతర రాజకీయ కార్యకలాపం ఉంటుంది. ప్రతిరోజూ ఒక కొత్త గ్రామం. ప్రతిరోజూ ఒక కొత్త సమస్య. ప్రతిరోజూ ఒక కొత్త రాజకీయ సందేశం. ప్రతిరోజూ మీడియా దృష్టి. ఈ మొత్తం ప్రక్రియ పార్టీకి మళ్లీ రాజకీయ ఆక్సిజన్ ఇవ్వగలదు. అందుకే 2027 పాదయాత్రను 2029 ఎన్నికల వ్యూహంలో ఒక కీలక అంకంగా చూడాల్సి ఉంటుంది. రాజకీయాల్లో ఒక మాట ఉంటుంది. పోయిన చోటనే వెతుక్కోవాలి. జగన్ ఇప్పుడు అదే చేస్తున్నారా? అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. 2019లో అధికారాన్ని తెచ్చిన ఆయుధం పాదయాత్ర. 2024లో అధికారం కోల్పోయిన తర్వాత మళ్లీ అదే ఆయుధాన్ని బయటకు తీస్తున్నారన్న ప్రచారం. గతంలో తనకు విజయాన్ని ఇచ్చిన రాజకీయ ఫార్ములాను మరోసారి ప్రయోగించాలనే ఆలోచన ఇందులో కనిపిస్తోంది. కానీ రాజకీయాల్లో పాత ఫార్ములా ఎప్పుడూ పనిచేస్తుందనే గ్యారెంటీ ఉండదు. 2017లో ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవు. అప్పటి రాజకీయ ప్రత్యర్థులు ఇప్పుడు అధికారంలో ఉన్నారు. అప్పటి ప్రజా సమస్యలు, ఇప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వేరు. అప్పటి సోషల్ మీడియా ప్రభావం, ఇప్పటి డిజిటల్ రాజకీయాల ప్రభావం వేరు. అప్పటి ఓటర్ల అంచనాలు, ఇప్పటి అంచనాలు వేరు. అందుకే జగన్ ఈసారి కేవలం పాత పాదయాత్రను పునరావృతం చేస్తే సరిపోదు. కొత్త రాజకీయ కథనాన్ని కూడా నిర్మించాల్సి ఉంటుంది.

### జాతకం కలిసిందా... రాజకీయ గణితం కలిసిందా?

2017లో జగన్ ప్రజలను ప్రశ్నించారు. వారి సమస్యలు విన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రత్యామ్నాయ పాలనకు హామీ ఇచ్చారు. ఇప్పుడు పరిస్థితి కొంత భిన్నంగా ఉంటుంది. ఈసారి ప్రజలు కూడా జగన్‌ను ప్రశ్నించే అవకాశం ఉంది. మీ పాలనలో ఏం జరిగింది? ఎందుకు ఓడిపోయారు? గత ఐదేళ్లలో చేసిన నిర్ణయాల్లో ఏవి తప్పు? ఏవి సరైనవి? తిరిగి అధికారంలోకి వస్తే ఏం మారుస్తారు? గత అనుభవాల నుంచి ఏం నేర్చుకున్నారు? పార్టీని ఎలా మార్చబోతున్నారు? ఇలాంటి ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాల్సి ఉంటుంది. అందుకే ఈ పాదయాత్ర ఒక రాజకీయ ప్రచారం మాత్రమే కాదు. అది ఒక రాజకీయ ఆత్మపరిశీలన కూడా కావచ్చు. ఇక మరోవైపు జగన్ జాతకం గురించి కూడా రాజకీయ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. నవంబర్ 9 వరకు అనుకూల పరిస్థితులు ఉండవని, ఆ తర్వాత ఒక్కసారిగా రాజకీయంగా అనుకూల వాతావరణం ఏర్పడుతుందని కొందరు జ్యోతిష్య అంచనాలను ప్రస్తావిస్తున్నారు. దాని ప్రకారం ఈ ఏడాది చివరి నుంచి జగన్ జిల్లాల పర్యటనలు మొదలు పెట్టి, క్రమంగా పార్టీ కార్యక్రమాలను పెంచి, 2027 జూలై 8 నుంచి పాదయాత్ర ప్రారంభించే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. జాతకాలను నమ్మేవారికి ఇది ఆసక్తికరమైన అంశమే. కానీ రాజకీయాల్లో చివరి తీర్పు మాత్రం జాతకం ఇవ్వదు. ప్రజలే ఇస్తారు. గ్రహాలు అనుకూలంగా ఉన్నాయా లేదా అన్నదానికంటే ప్రజల మూడ్ అనుకూలంగా ఉందా లేదా అన్నదే జగన్‌కు ముఖ్యం. జ్యోతిష్య గణితం ఒకటి కావచ్చు. రాజకీయ గణితం మరొకటి. రెండూ కలిస్తే నాయకుడికి అదృష్టం. కానీ ప్రజల గణితం కలవకపోతే మిగతావన్నీ వృథానే.

### జూలై ఎనిమిది నిజమైతే...వైసీపీ క్యాడర్ ఎదురుచూపులు

2024 ఎన్నికల తర్వాత వైసీపీ శ్రేణుల్లో ఒకరకమైన నిశ్శబ్దం కనిపించింది. భారీ పరాజయం తర్వాత కార్యకర్తల్లో నిరుత్సాహం రావడం సహజమే. అధికారంలో ఉన్నప్పుడు చుట్టూ ఉండే రాజకీయ వాతావరణం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉండదు. నాయకత్వం కూడా మరింత కష్టపడాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో జగన్ పాదయాత్ర చేస్తారన్న వార్త కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకురావడం సహజం. నాయకుడు రోడ్డుపైకి వస్తే కేడర్ కదులుతుంది. కేడర్ కదిలితే పార్టీ నిర్మాణం బలపడుతుంది. పార్టీ బలపడితే ఎన్నికల పోరాటానికి పునాది పడుతుంది.

### తండ్రి జయంతి... కుమారుడి పాదయాత్ర



జూలై 8 వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి. వైఎస్ కుటుంబానికి ఆ రోజు ఒక భావోద్వేగ తేదీ. వైఎస్ అభిమానులకు ఒక రాజకీయ సెంటిమెంట్. వైసీపీ కార్యకర్తలకు ఒక గుర్తింపు. అలాంటి రోజున జగన్ తన పాదయాత్రను ప్రారంభిస్తే దానికి రాజకీయ వ్యూహంతో పాటు భావోద్వేగపు రంగు కూడా వస్తుంది. తండ్రి రాజకీయ వారసత్వాన్ని మోస్తున్న జగన్, తండ్రి జయంతి రోజున ప్రజల మధ్యకు వెళ్లడం ద్వారా ఆ అనుబంధాన్ని మరింత బలపరచాలని భావిస్తున్నారా అన్నది ఇప్పుడు చర్చ. తండ్రి పేరు ఒక కుటుంబ వారసత్వం మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక ప్రత్యేకమైన బ్రాండ్. ఆ బ్రాండ్‌ను జగన్ తన రాజకీయ పునరాగమనానికి ఉపయోగించుకోవాలనుకుంటున్నారా? అన్నది కూడా ఆసక్తికరమైన ప్రశ్న. 2017లో జగన్ పాదయాత్రకు ముందు కూడా వైఎస్ రాజశేఖరరెడ్డి జ్ఞాపకాలు వైసీపీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు మళ్లీ అదే సెంటిమెంట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరిగితే ఆశ్చర్యం లేదు.

అందుకే వైసీపీ కార్యకర్తలకు ఇప్పుడు అసలు ఆసక్తి తేదీ మీదే. జగన్ ఎప్పుడు నడుస్తారు? ఎక్కడి నుంచి నడుస్తారు? ఎంత దూరం నడుస్తారు? ఎన్ని రోజులు నడుస్తారు? ఎలాంటి మార్గంలో సాగుతారు? అన్నది తెలుసుకోవాలని వారు ఎదురుచూస్తున్నారు. ఒకవేళ 2027 జూలై 8 నిజంగానే ముహూర్తమైతే, ఆ రోజు వైసీపీ రాజకీయాల్లో ఒక భారీ ఈవెంట్‌గా మారే అవకాశం ఉంది. వైఎస్సార్ జయంతి. జగన్ పాదయాత్ర ప్రారంభం. తండ్రి జ్ఞాపకం. కుమారుడి రాజకీయ పునఃప్రయాణం. పార్టీ కార్యకర్తల సమీకరణ. అభిమానుల సందడి. ఈ అన్ని అంశాలు కలిసి ఒక భారీ రాజకీయ వాతావరణాన్ని సృష్టించవచ్చు. జగన్ మొదటి అడుగు వేయగానే ఆ అడుగును అనుసరించేందుకు కార్యకర్తలు పోటీ పడవచ్చు. అభిమానులు రోడ్లపైకి రావచ్చు. పల్లెల్లో స్వాగత కార్యక్రమాలు ఏర్పాటవచ్చు. నాయకుడి కోసం గ్రామాలు ఎదురుచూడవచ్చు. అయితే ఇవన్నీ రాజకీయ ఊహాగానాలే. ప్రజా స్పందన ఎలా ఉంటుంది అన్నది అప్పుడే తెలుస్తుంది. పాదయాత్రకు వచ్చే జనసమూహం మాత్రమే విజయానికి కొలమానం కాదు. ఆ జనసమూహం ఓటుగా మారుతుందా? వారి అభిమానం రాజకీయ నమ్మకంగా మారుతుందా? అన్నదే అసలు విషయం.

### గమ్యం 2029.. మళ్లీ అదే దృశ్యం వస్తుందా?

జగన్ పాదయాత్రకు వెనుక ఉన్న అసలు గమ్యం ఏదైనా ఒకటే—2029. అధికారాన్ని తిరిగి సాధించడం. 2024లో కోల్పోయిన అధికారాన్ని మళ్లీ దక్కించుకోవడం. అయితే ఆ ప్రయాణం పాదయాత్రతోనే మొదలవుతుంది. పాదయాత్రతో ముగియదు. పార్టీకి కొత్త నాయకత్వం కావాలి. బలహీనమైన నియోజకవర్గాల్లో మార్పులు రావాలి. స్థానిక సమస్యలపై స్పష్టమైన విధానం కావాలి. కార్యకర్తలకు భరోసా ఇవ్వాలి. ప్రజల్లో విశ్వాసాన్ని తిరిగి సంపాదించాలి. గత పాలనపై వచ్చిన విమర్శలకు సమాధానాలు చెప్పాలి. ప్రత్యర్థుల రాజకీయ కథనానికి ప్రత్యామ్నాయ కథనం నిర్మించాలి. ఇవన్నీ జరిగితేనే పాదయాత్ర ఒక ఎన్నికల విజయానికి దారి తీస్తుంది. 2017లో జగన్ ముందుకు నడిచారు. ప్రజలు ఆయన వెంట నడిచారు. ఆ అడుగులు 2019లో అధికార పీఠం వరకు తీసుకెళ్లాయి. ఇప్పుడు మళ్లీ అదే దృశ్యం పునరావృతమవుతుందా? ఇదే అసలు ప్రశ్న. రాజకీయ చరిత్రలో రెండోసారి జరిగేది మొదటిసారి జరిగినట్టే ఉండదు. ప్రజల మనసు ఒకే చోట ఉండదు. ఓటరు కూడా మారుతాడు. సమస్యలు మారతాయి. నాయకులపై అంచనాలు మారతాయి. అందుకే 2017 విజయాన్ని 2029కు ముందస్తు హామీగా చూడటం పొరపాటు. అయితే జగన్‌కు ఒక ప్రయోజనం ఉంది. పాదయాత్ర అనే ఆయుధాన్ని ఇప్పటికే ఉపయోగించి దాని శక్తిని అనుభవించిన నాయకుడు ఆయన. ప్రజల మధ్య నడవడం ఆయనకు కొత్త కాదు. వేలాది కిలోమీటర్ల ప్రయాణం చేయడం కొత్త కాదు. పార్టీని ఒకే దిశలో నడిపించడం కూడా కొత్త కాదు. ఈ అనుభవం ఈసారి ఆయనకు ఉపయోగపడవచ్చు.

### వస్తున్నా... గర్జనై!

ఒక నాయకుడు మళ్లీ ప్రజల్లోకి వస్తున్నాడని చెప్పడం సులభం. కానీ ప్రజల మనసుల్లోకి మళ్లీ ప్రవేశించడం అంత సులభం కాదు. రోడ్డు మీద నడవడం సులభం. ప్రజల హృదయంలో చోటు సంపాదించడం కష్టం. ఒకసారి వచ్చిన విజయాన్ని మరోసారి పునరావృతం చేయడం ఇంకా కష్టం. జగన్ ముందున్న సవాలు అదే. గతం ఆయనకు ఒక ఉదాహరణ. వర్తమానం ఒక పరీక్ష. భవిష్యత్తు ఒక లక్ష్యం. 2027 జూలై 8 నిజంగా పాదయాత్రకు ముహూర్తమైతే, ఆ రోజు నుంచి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో 2029 ఎన్నికల కోసం అసలు యుద్ధం మొదలయ్యే అవకాశం ఉంది. జగన్ అడుగు ముందుకు వేస్తే వైసీపీ శ్రేణులు కదులుతాయి. ఆ అడుగులను ప్రత్యర్థులు గమనిస్తారు. ప్రజలు అంచనా వేస్తారు. రాజకీయ విశ్లేషకులు లెక్కలు వేస్తారు. అప్పుడు రోడ్ల మీద కనిపించేది కేవలం ఒక నాయకుడు కాదు. ఒక పార్టీ భవిష్యత్తు కోసం వేసే రాజకీయ పందెం. తండ్రి జయంతి రోజున కుమారుడి అడుగు. గత విజయాన్ని గుర్తు చేసే పాదయాత్ర. 2029ను లక్ష్యంగా పెట్టుకున్న రాజకీయ ప్రయాణం. జనంలోకి వెళ్లే నాయకుడు. జనాన్ని తనవైపు తిప్పుకోవాలనుకునే పార్టీ. అందుకే వైసీపీ శ్రేణుల ఆశ ఒక్కటే—జగన్ వస్తే చాలు, మళ్లీ నడిస్తే చాలు, ఆ అడుగులకు జనం అడుగులు కలిస్తే చాలు. రోడ్లు జనంతో నిండాలి. పల్లెలు పలకరించాలి. గడపలు గొంతు విప్పాలి. జనం తమ బాధలు చెప్పాలి. నాయకుడు వాటిని వినాలి. అప్పుడు మాత్రమే పాదయాత్ర ఒక రాజకీయ కార్యక్రమం నుంచి ప్రజా ఉద్యమంగా మారుతుంది. జగన్‌కు ముహూర్తం రాజకీయంగా ఖరారవుతుందా? జాతకం కలిసొస్తుందా? పార్టీ కేడర్ పూర్తిగా కదులుతుందా? ప్రజలు గతాన్ని గుర్తు చేసుకుంటారా? లేక భవిష్యత్తు వైపు చూస్తారా? ఇవన్నీ రాబోయే కాలమే తేల్చాలి. కానీ ఒక విషయం మాత్రం ఇప్పుడే స్పష్టం. 2027 జూలై 8 అనే తేదీ నిజమైతే... జగన్ పాదయాత్రకు అది తొలి రోజు మాత్రమే. 2029 కోసం వైసీపీ రాజకీయ పునరాగమనానికి మాత్రం అదే తొలి అడుగు కావచ్చు. అడుగు పడితే అలజడి మొదలవుతుంది. అడుగులు పెరిగితే రాజకీయ వేడి పెరుగుతుంది. జనం జత కలిస్తే జనసంద్రం అవుతుంది. ఆ జనసంద్రం ఓటు సముద్రంగా మారితే... అప్పుడు మాత్రమే ఆ అడుగుల గమ్యం తెలుస్తుంది. అందుకే ఇప్పుడు వైసీపీ శ్రేణుల నోట ఒకే మాట—వస్తున్నా... గర్జనై! మీకోసం... ప్రాణమై! కానీ ఆ నినాదానికి చివరి అర్థం చెప్పేది జగన్ కాదు. ప్రజలే.



### రోడ్లన్నీ జనబాటలైతే...ముహూర్తం ఖరారైందా?



జగన్ పాదయాత్ర మొదలైన రోజున రోడ్లు కేవలం రోడ్లుగా ఉండకపోవచ్చు. అవి రాజకీయ వేదికలుగా మారవచ్చు. పల్లెలు కేవలం గ్రామాలుగా కనిపించకపోవచ్చు. అవి ప్రజాభిప్రాయ కేంద్రాలుగా మారవచ్చు. ప్రతి అడుగు ఒక వార్త కావచ్చు. ప్రతి గ్రామం ఒక రాజకీయ సందేశం కావచ్చు. ప్రతి సమస్య ఒక ఎన్నికల హామీకి బీజం కావచ్చు. జగన్ రెండు అడుగులు వేస్తే వేలాది అడుగులు జత కలవాలని అభిమానులు కోరుకుంటున్నారు. పల్లెలు పూలతో స్వాగతం పలకాలని ఆశిస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా జనసంద్రం కనిపించాలని కోరుకుంటున్నారు. తమ నాయకుడి అడుగులకు తమ అడుగులు కలపాలని వైసీపీ కేడర్ ఎదురు చూస్తోంది. కానీ ఆ జనసంద్రం నిజంగా ఎంత పెద్దదో, ఆ ఉత్సాహం ఎంత లోతైనదో, ఆ అభిమానం ఓటుగా ఎంతవరకూ మారుతుందో కాలమే తేల్చాలి. ప్రస్తుతం 2027 జూలై 8 తేదీ చుట్టూ జరుగుతున్న ప్రచారాన్ని మాత్రం అంతిమ నిర్ణయంగా చూడలేం. వైసీపీ అధికారికంగా ప్రకటించే వరకు ఇది రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం మాత్రమే. పాదయాత్ర మార్గం, ప్రారంభ స్థలం, ముగింపు స్థలం, షెడ్యూల్, కార్యక్రమ రూపకల్పన వంటి అంశాలు ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. కానీ ఒక తేదీ చర్చలోకి రావడం కూడా చిన్న విషయం కాదు. ముఖ్యంగా అది జగన్ గత రాజకీయ చరిత్రతో, వైఎస్సార్ జయంతితో ముడిపడి ఉండటం మరింత ఆసక్తికరంగా మారింది. జగన్ మానసికంగా సిద్ధమయ్యారా? బహుశా సిద్ధమవుతున్నారేమో. పార్టీ సిద్ధమవుతోందా? సంకేతాలు కనిపిస్తున్నాయి. కార్యకర్తలు ఎదురుచూస్తున్నారా? వైసీపీ వర్గాల మాటలు చూస్తే అవుననే చెప్పాలి. ప్రజలు సిద్ధంగా ఉన్నారా? దానికి మాత్రం సమాధానం చెప్పాల్సింది ప్రజలే.

# భారత్-జపాన్ తొలి టీ20 పోరు

## దౌత్య బంధానికి క్రికెట్ వేడుక




భారత్-జపాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకలకు క్రికెట్ వేదిక కానుంది. సెప్టెంబర్ 22న జపాన్‌లోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్-జపాన్ మధ్య తొలి పురుషుల టీ20 అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. సుజుకి కప్‌లో భాగంగా జరిగే ఈ వన్డే మ్యాచ్ ఇరు దేశాల క్రికెట్ చరిత్రలో ప్రత్యేకంగా నిలవనుంది. జపాన్‌తో టీ20 ఆడటం భారత్‌కు ఇదే తొలిసారి. జపాన్ ప్రధాని సనాయే తకాయిచి, భారత ప్రధాని నరేంద్ర మోదీ సమావేశంలో కుదిరిన ఒప్పందం నుంచి 'స్పోర్ట్ 75' కార్యక్రమం రూపుదిద్దుకుంది. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం లక్ష్యంగా ఇరు దేశాల క్రీడా సహకారాన్ని పెంచడమే దీని ఉద్దేశం. ఈ మ్యాచ్‌తో జపాన్, తూర్పు ఆసియాలో క్రికెట్‌ను విస్తరించేందుకు బీసీసీఐ ప్రయత్నించనుంది. ప్రపంచ ఛాంపియన్ భారత్‌తో ఆడటం తమకు చారిత్రక ఘట్టమని జపాన్ క్రికెట్ అసోసియేషన్ పేర్కొంది. జపాన్ ప్రస్తుతం టీ20 ర్యాంకింగ్స్‌లో 41వ స్థానంలో ఉంది. ఇండియాకు టీ20ల్లో ప్రత్యర్థిగా నిలిచే 20వ జట్టు జపాన్ కానుంది.

# వైభవ్‌కు సచిన్ దిశానిర్దేశం




15 ఏళ్ల సంచలన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ ప్రత్యేక దృష్టి పెట్టింది. ముంబైలో జరిగిన సమీక్ష సమావేశం అనంతరం బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. వైభవ్ ఒక్క సిరీస్ లేదా ఒక్క ఏడాది మెరుపుగా మిగలకుండా, సచిన్ టెండూల్కర్‌లా సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్ నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. అతడికి సరైన మార్గదర్శకత్వం, మద్దతు అందించేందుకు ప్రతి దశను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ఇటీవల దులీప్ ట్రోఫీలో 15 ఏళ్ల 157 రోజుల వయసులో అత్యంత పిన్న వయస్కుడిగా అర్ధశతకం సాధించిన వైభవ్, జింబాబ్వేపై మూడు మ్యాచ్‌ల్లో 151 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఇంగ్లాండ్‌తో టీ20ల్లో భారత్ తరపున అత్యంత పిన్న వయసులో అరంగేట్రం చేశాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున 776 పరుగులు, 237.30 స్ట్రైక్‌రేట్ తో అదరగొట్టి ఆరెంజ్ క్యాప్‌తో పాటు పలు అవార్డులు అందుకున్నాడు. అండర్ 19 ప్రపంచకప్‌లో 439 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన వైభవ్ భవిష్యత్తుపై బీసీసీఐ భారీ అంచనాలు పెట్టుకుంది.

# అవి అసలు నిర్ణయాలేనా?

## ఒకేసారి అంతమందినా?

## క్రికెట్ ఇష్టా అంటే ఇష్టారాజ్యమా?

## పాక్ కోచ్ హెస్సేన్ సంచల వ్యాఖ్యలు




పాకిస్థాన్ టెస్ట్ జట్టుకు తాత్కాలిక కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మైక్ హెస్సన్, ఇంగ్లాండ్ పర్యటనలో పీసీబీ చేపట్టిన భారీ జట్టు మార్పులు తనను కూడా కొంత ఆశ్చర్యానికి గురిచేశాయని తెలిపారు. జట్టు నుంచి పలువురు ఆటగాళ్లను స్వదేశానికి పంపిన తర్వాత అత్యవసరంగా తనను ఇంగ్లాండ్‌కు రప్పించారని చెప్పారు. నిర్ణయాల వెనుక తాను భాగస్వామి కాదని, టెస్ట్ ఎంపికలో ఇప్పటివరకు తనకు పాత్ర లేదని స్పష్టం చేశారు. తన టీ20 కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘాతో పాటు మహ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ వంటి ఆటగాళ్లు జట్టు నుంచి వెళ్లిపోయారని తెలిపారు. ఇంగ్లాండ్ పరిస్థితులకు సరిపోయే సమతూకమైన జట్టును సిద్ధం చేయడమే ప్రస్తుతం తన ముందున్న లక్ష్యమన్నారు. హెస్సన్ ప్రత్యేకంగా అలీ ఉస్మాన్ ఉదాహరణను ప్రస్తావించారు. పర్యటనలో అద్భుతంగా రాణించి రెండు ఐదు వికెట్ల ప్రదర్శనలు చేసినప్పటికీ, ఇంగ్లాండ్‌లో ఫింగర్ స్పిన్నర్‌కు పరిమిత అవకాశాలున్నందున అతడిని తప్పించాల్సి వచ్చిందన్నారు. జట్టు మార్పుల తీరు ఆటగాళ్లను బాధపెట్టి ఉండొచ్చని అంగీకరించారు. సిరీస్ మధ్యలో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. అయితే గత నిర్ణయాలపై దృష్టి పెట్టకుండా ఎడ్జ్‌బాస్టన్‌లో జరగనున్న మూడో టెస్ట్‌పైనే పూర్తి ఫోకస్ పెట్టామని చెప్పారు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో వైట్ వాష్ తప్పించుకోవడం పాకిస్థాన్‌కు ఇప్పుడు ప్రధాన సవాలుగా మారింది.

# నఖ్వీపై ఐస్‌లాండ్ క్రికెట్ సెటైర్



పాకిస్థాన్ క్రికెట్ జట్టు వరుస పరాజయాలు, పీసీబీ నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ ఐస్‌లాండ్ క్రికెట్ బోర్డు పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీపై వ్యంగ్యాస్త్రం సంధించింది. ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్ 02తో వెనుకబడటం, రెండో టెస్ట్ తర్వాత ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపడం నేపథ్యంలో ఐస్‌లాండ్ క్రికెట్ 'ఎక్స్'లో ఓ సరదా సవాల్ ప్రకటించింది. మంచుకొండను తొలగించిన వారికి "నఖ్వీని కలిసి ఎంపిక వ్యూహాలు నేర్చుకునే ఖర్చులన్నీ చెల్లించిన విద్యా పర్యటన" ఇస్తామని పేర్కొంది. కావాలంటే ఆ ప్రయాణం వన్‌వేగా కూడా ఉండొచ్చంటూ సెటైర్ చేసింది. ఇటీవల విమర్శలపై నఖ్వీ స్పందిస్తూ, జట్టును ఎప్పుడూ తక్కువ చేసి మాట్లాడొద్దని అభిమానులను కోరారు. గతంలో ఉన్న ర్యాంకింగ్‌తో పోలిస్తే వన్డేల్లో పురోగతి సాధించామని చెప్పారు. అయితే ఎంపికల్లో తప్పులు జరిగితే దానికి తానే బాధ్యత వహిస్తానని అంగీకరించారు. తక్కువ స్థాయి నుంచి అగ్రస్థానానికి చేరేందుకు సమయం పడుతుందని స్పష్టం చేసిన నఖ్వీ వ్యాఖ్యల నేపథ్యంలో ఐస్‌లాండ్ క్రికెట్ చేసిన ఈ వ్యంగ్య పోస్టు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది.

# నేడు భారత్-పాక్ పోరు..

# బ్యాటింగ్‌కు పరీక్ష

## సెమీస్ బెర్త్ ఖాయం.. పోరు మాత్రం కీలకం




మహిళల టీ20 ఆసియా కప్‌లో భారత్-పాకిస్థాన్ మ్యాచ్ శనివారం దుబాయ్‌లో జరగనుంది. భారత్ ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. పాకిస్థాన్ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడినా, తదుపరి మ్యాచ్ హాంకాంగ్‌తో ఉండటంతో నాకౌట్ చేరే అవకాశాలు మెరుగ్గానే ఉన్నాయి. అందుకే ఈ మ్యాచ్‌లో ఫలితం కంటే ఇరు జట్ల బ్యాటింగ్ లోతు ప్రధాన పరీక్షగా మారింది. భారత్ ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ అద్భుతంగా రాణిస్తున్నారు. మంధాన 143 పరుగులతో టాప్‌లో ఉండగా, షఫాలీ 92 పరుగులు చేసింది. అయితే థాయ్‌లాండ్‌పై భారత్ 46 పరుగులకే 8 వికెట్లు కోల్పోవడం, హాంకాంగ్‌పై 3 నుంచి 7 స్థానాల్లోని బ్యాటర్లు కలిపి 34 పరుగులే చేయడం మిడిలార్డర్ బలహీనతను బయటపెట్టాయి.

### స్పిన్నర్లకు అనుకూలంగా దుబాయ్

పాకిస్థాన్ కూడా బ్యాటింగ్‌లో ఇలాంటి సమస్యలనే ఎదుర్కొంటోంది. అయితే శ్రీలంక పర్యటనలో షవాల్ జుల్ఫికార్, మునీబా అలీ దూకుడైన బ్యాటింగ్‌తో 170కిపైగా స్కోర్లు సాధించారు. భారత్‌కు ప్రేమా రావత్ స్పిన్‌లో కీలకంగా మారగా, పాకిస్థాన్ నష్రా సంధూ ప్రధాన ఆయుధంగా కనిపిస్తోంది. భారత్‌పై సంధూకు మంచి రికార్డు ఉంది. ఆసియా కప్‌లో భారత్-పాక్ ఇప్పటివరకు ఏడుసార్లు తలపడగా భారత్ 61 ఆధిక్యంలో ఉంది. దుబాయ్ పిచ్‌పై స్పిన్నర్లకు ఎక్కువ సహకారం లభిస్తోంది. ఇప్పటివరకు స్పిన్నర్లు 71 వికెట్లు పడగొట్టారు. దీంతో టాస్ గెలిచిన జట్టు నిర్ణయం కూడా కీలకం కానుంది.




# 'ఆర్‌సీ 17'కి అంతా సిద్ధం?

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన 'పెద్ది' చిత్రం రూ. 400 కోట్లకు పైగా వసూళ్లతో అఖండ విజయం సాధించిన జోష్‌లో ఉన్న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, తన తదుపరి ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యారు. 'రంగస్థలం' వంటి చారిత్రాత్మక ఇండస్ట్రీ హిట్ తర్వాత క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రానున్న '్ర్స=17' ముహూర్తపు వేడుకలను రాబోయే దసరా పండుగ సందర్భంగా నిర్వహించి, నవంబర్ నుంచి మైత్రీ మూవీ మేకర్స్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనుంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రష్మిక మందానా, రుక్మిణి వసంత్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకున్న రూటెడ్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' ఇటీవలే బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని అందుకుంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో మెరిసిన ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎ.ఆర్. రెహమాన్ అందించిన స్వరాలు ప్రాణంగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను కొల్లగొట్టి 'పెద్ది' చరణ్ కెరీర్లోనే సోలో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ భారీ విజయం అందించిన జోష్‌తో ఉన్న రామ్ చరణ్ తన నెక్స్ట్ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో సుకుమార్ రామ్‌చరణ్ కాంబినేషన్లో వచ్చిన 'రంగస్థలం' బాక్సాఫీస్ వద్ద ఎన్ని రికార్డుల్ని క్రియేట్ చేసిందో తెలిసిందే. చిట్టిబాబు పాత్రలో రామ్ చరణ్ ఒదిగిపోయిన తీరు, సుకుమార్ అద్భుత దర్శకత్వ ప్రతిభ వెండితెరపై ఒక క్లాసిక్‌గా నిలిచాయి. ఆ ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పై మొదటి నుంచే భారీ హైప్ నెలకొంది. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇప్పటికే ప్రీప్రొడక్షన్ వ్యవహారాలన్నీ ముగింపు దశకు చేరుకున్నాయి. రాబోయే దసరా పండుగ శుభదినాన ఈ సినిమా ప్రారంభోత్సవా న్ని ఘనంగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అనంతరం నవంబర్ మొదటి వారం నుంచే రెగ్యులర్ షూటింగ్ నిరవధికంగా జరపాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. 'రంగస్థలం'లో చరణ్‌ని గ్రామీణ యువకుడిగా, 'పుష్ప'లో అల్లు అర్జున్‌ను మాస్ అవతారంలో చూపించిన సుకుమార్.. '్ర్స=17' కోసం పూర్తి భిన్నమైన పంథాను ఎంచుకున్నారు.

# నోరుపారేసుకున్న నటి కస్తూరి



కొందరు సెలబ్రిటీలు ఏం మాట్లాడినా, ఏం చేసినా ఖచ్చితంగా వివాదాస్పదం అవుతుంది. ఈ కోవలోకే వస్తారు తమిళ నటి కస్తూరి శంకర్. మనసులో ఎలాంటి భావం ఉన్నా ఉన్నది ఉన్నట్లు ముఖం మీద చెప్పడంతో ఈమె ముందు వరుసలో ఉంటారు. తొలి నుంచి డేరింగ్ అండ్ డాషింగ్ బిహేవియర్‌తో ఏరికోరి వివాదాల్లో చిక్కుకున్నారు కస్తూరి. సినీరంగంలో మహిళలపై వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్‌తో పాటు తమిళనాడులో ఉంటున్న తెలుగువారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి జైలుకు కూడా వెళ్లొచ్చారు. ఆ తర్వాత కాస్త సైలెంట్ అయినప్పటికీ తిరిగి యాక్టీవ్ అయ్యారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తుతం హీరో పాత్రలను చూపిస్తున్న విధానంపై కస్తూరి శంకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1991లో ఆతా ఉన్ కోయిలే సినిమా ద్వారా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ఆమె.. మూడున్నర దశాబ్ధాల కెరీర్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వందకు పైగా చిత్రాల్లో నటించారు. నిప్పు రవ్వ, గాడ్ ఫాదర్, సొగ్గాడి పెళ్లాం, మెరుపు, చిలక్కొట్టుడు, అన్నమయ్య, మా ఆయన బంగారం, ఆకాశ వీధిలో, డాన్ శీను, శమంతకమణి, సింబా వంటి సినిమాలతో తెలుగువారిని పలకరించారు. కెరీర్ పీక్స్‌లో ఉండగానే పెళ్లి చేసుకున్న కస్తూరి ఆ తర్వాత తన కెరీర్‌కు కొన్నాళ్లు బ్రేక్ ఇచ్చి ఫ్యామిలీ, పిల్లల కోసం అంకితమయ్యారు. ఇటీవల సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన కస్తూరి.. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారిపోయారు. సినిమాలే కాదు బుల్లితెరపైనా ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకులను అలరిస్తున్నారు. తెలుగులో ఆమె నటించిన గృహలక్ష్మి సీరియల్.. ప్రేక్షకులకు కస్తూరిని దగ్గర చేసింది. ప్రస్తుతం ధర్మస్థల నియోజకవర్గం అనే తెలుగు మూవీలో కస్తూరి శంకర్ నటించారు. ఇందులో నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్‌లో కస్తూరి నటించినట్లుగా వార్తలు వస్తున్నాయి. మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ బ్యానర్‌పై మేరుం భాస్కర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర, వరుణ్ సందేశ్, వితికా షేరులు ఈ సినిమాలో కీలకపాత్రలు పోషించారు. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 4న ధర్మస్థల నియోజకవర్గం మూవీ వరల్డ్ వైడ్‌గా విడుదలైంది.

# స్వార్థం లేని స్నేహితులు దొరకడం అరుదు



తనదైన నటన, యాక్షన్ సీక్వెన్స్‌లతో సౌత్ సినీ ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్నారు యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా . సుమారు మూడు దశాబ్దాలకు పైగా తెలుగు, తమిళంలో ఎన్నో చిత్రాల్లో నటించిన ఆయన ఎంతోమందిని తన అభిమానులుగా మార్చుకున్నారు. కేవలం యాక్షన్ చిత్రాలకే పరిమితం కాకుండా ఫ్యామిలీ ఆడియన్స్‌ని మెప్పించే సినిమాలు తీసి అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తూ వస్తున్నారు. ఇటీవలే 'బ్లాస్ట'తో మన బాక్సాఫీస్ సత్తా తగ్గలేదని మరోసారి నిరూపించారు. అయితే ఈ ప్రయాణం వెనుక ఆయన పడిన ఎన్నో కష్టాలు, అవమానాలు దాగి ఉన్నాయి. కెరీర్ ఆరంభంలో ఎదురైన ఒడిదుడుకులు, అవకాశాల కోసం చేసిన పోరాటాలు తనను రాటుదేలేలా చేశాయని ఆయన తరచూ గుర్తుచేసుకుంటుంటారు. తాజాగా ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన కెరీర్, పరిశ్రమలోని స్నేహితులు, తన జీవితంలో అత్యంత విషాదకర ఘటన గురించి వివరిస్తూ ఎమోషనల్ అయ్యారు. సినీ రంగంలో స్వార్థం లేని స్నేహితులు దొరకడం ఎంతో అరుదని పేర్కొన్న అర్జున్... జగపతిబాబుతో తనకు ఉన్న సన్నిహిత అనుబంధాన్ని ప్రస్తావించారు. అదే క్రమంలో దివంగత నటి సౌందర్యని గుర్తుచేసుకుంటూ ఆయన కంటతడి పెట్టించే విషయాలను షేర్ చేసుకున్నారు. అందానికి అందం, అంతకుమించిన అద్భుతమైన సహజ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న సౌందర్య.. తనకు కేవలం ఒక కో స్టార్ మాత్రమే కాదని, జీవితంలో లభించిన అత్యుత్తమ స్నేహితురాలని అర్జున్ కొనియాడారు. 'ఒకరిని కోల్పోతే కలిగే శూన్యం ఎంతటిదో, 'ఐ మిస్ యూ' అనే చిన్న మాటకు ఎంతటి బరువైన అర్థం ఉందో సౌందర్య మన మధ్య లేకపోవడంతోనే నాకు తెలిసింది' అంటూ ఆయన ఎమోషనల్ అయ్యారు. సౌందర్య భౌతికంగా దూరమైన తర్వాతే తన జీవితంలో ఆమె ఎంతటి స్థానాన్ని ఆక్రమించిందో మరింత లోతుగా అర్థమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్జున్, సౌందర్య కలిసి నటించిన సినిమాలు వెండితెరపై ప్రత్యేకమైన ముద్ర వేశాయి.

# హారర్ కామెడీ' బాటలో మాస్ మహారాజా




బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలైతే ఎలా ఉంటుందో మాస్ మహారాజా రవితేజ మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘనవిజయం సాధించి థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఈ చిత్రం తాజాగా రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగు పెట్టింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ సైతం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమా ఆరంభంలో బేబీ నక్షత్ర, రవితేజ, ప్రియా భవానీ శంకర్‌లపై చిత్రీకరించిన అన్‌సీన్ స్టిల్‌ను చిత్ర దర్శకుడు శివ నిర్వాణ పంచుకుంటూ సక్సెస్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో వేగాన్ని పెంచడమే కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎప్పుడూ రొటీన్ మాస్, కమర్షియల్ ఫార్ములాకే పరిమితం కాకుండా, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సరికొత్త ప్రయాణంలో భాగంగా టాలీవుడ్‌లో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో రవితేజ చేతులు కలిపారు. 'సరిపోదా శనివారం' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వివేక్ ఆత్రేయ సిద్ధం చేసిన కథ రవితేజను అమితంగా ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రవితేజ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నడూ టచ్ చేయని 'హారర్ కామెడీ' జోనర్‌లోకి తొలిసారిగా అడుగుపెడుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా మాస్ యాక్షన్, ఫ్యామిలీ డ్రామా, క్రైమ్ థ్రిల్లర్లతో పాటు పక్కా ఎంటర్‌టైనర్లలో రవితేజ తన మార్క్ చూపించారు. అయితే ప్రేక్షకులను భయపెడుతూనే కడుపుబ్బా నవ్వించే హారర్ కామెడీ తరహా పాత్రను ఆయన ఇంతవరకు చేయలేదు. వివేక్ ఆత్రేయ మార్క్ విలక్షణమైన స్క్రీన్‌ప్లే, రవితేజ అసమానమైన ఎనర్జీ, టైమింగ్ తోడైతే వెండితెరపై నవ్వుల విందు గ్యారెంటీ అని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లక్ష్మణ్, శ్రీని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనుల్లో ఉంది. వివేక్ ఆత్రేయ చిత్రంతో పాటే మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను కూడా రవితేజ ఖరారు చేశారు. 'రాజ రాజ చోర', 'స్వాగ' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో ఓ అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు (శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్) నిర్మిస్తున్న ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు మరో ప్రధాన పాత్రలో సందడి చేయనున్నారు.

# ఓటీటీలోకి కాంట్రవర్సీ మూవీ



ఇటీవల కొన్ని సినిమాలు విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకుంటున్నాయి. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలు లేదా సంభాషణల విషయంలో కొన్ని సంస్థలు ఈ చిత్రాలను వ్యతిరేకించడంతో అవి థియేటర్లలో విడుదల కావడం లేదు. అలాగే బోల్డ్ కంటెంట్ కారణంగా కూడా కొన్ని సినిమాలు విడుదల కాలేదు. అయితే, ఈ చిత్రాలు ప్రస్తుతం ఓటీటీలో అందుబాటులో ఉన్నాయి. ప్రేక్షకులు కూడా ఈ చిత్రాలను ఓటీటీలో చూసేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. అలా థియేటర్లలో నిషేధానికి గురై ఓటీటీలో సంచలనం సృష్టించిన సినిమా 'అన్‌ఫ్రీడమ'. బాలీవుడ్ దర్శకుడు రాజ్ అమిత్ కుమార్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఉగ్రవాదం, మత ఛాందసవాదం, స్వలింగ సంపర్కం, ప్రేమ, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి సున్నితమైన అంశాలు ఉన్నాయి. దీంతో 2015లో ఈ చిత్రానికి భారతదేశంలో థియేటర్లలో విడుదలకు ఆమోదం లభించలేదు. 'అన్‌ఫ్రీడమ' సినిమా కథ వివిధ పాత్రల జీవితాల చుట్టూ తిరుగుతుంది. ఒకవైపు ఇది ఉగ్రవాదం, మత ఛాందసవాదం వంటి సమస్యలను ప్రస్తావిస్తూనే, మరోవైపు తమ సొంత గుర్తింపు, ప్రేమ, తాము కోరుకున్నట్లుగా జీవించే హక్కు కోసం పోరాడుతున్న వ్యక్తుల కథను ఆవిష్కరిస్తుంది. 'అన్‌ఫ్రీడమ' చిత్రాన్ని భారతదేశంలో విడుదల కోసం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కి సమర్పించారు.

This newspaper is Owned and Published by GUNDEBOINA VENKANNA from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: GUNDEBOINA VENKANNA and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: TGBIL/26/A6717. www.rajyasamskarana.com.